తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి : 02 సంచిక 354 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి మంగళవారం 10-06-2025 పేజీలు : 12

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..
తెలుగు-వెలుగు
మీకో చక్కని వేదికగా నిలుస్తోంది.
ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని
చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
97050 43131 | 8096660656

# ఇండియా ఫస్ట్

**మా ప్రతి విధానం వెనుకా ఇదే నినాదం**

**సమష్టి విజయాలకు గర్విస్తున్నాం: మోదీ**



**న్యూఢిల్లీ, జూన్ 9:** తన ప్రభుత్వ ఆధ్వర్యంలో గత 11 ఏళ్లలో భారత్ అతి వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే గాక.. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నొవేషన్‌లో అంతర్జాతీయంగా కీలక గొంతుకగా మారిందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. తమ ప్రతి విధానం, నిర్ణయం వెనుక 'ఇండియా ఫస్ట్' చోదక శక్తిగా ఉందన్నారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్..' ఎన్‌డీఏ ప్రభుత్వ మార్గదర్శక సూత్రంగా పేర్కొన్నారు. దీనిద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రధాని పగ్గాలు చేపట్టి 11 ఏళ్లు.. మూడోసారి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. '11 ఏళ్ల సేవలో' అనే హ్యాష్‌టాగ్ జోడించారు. ఈ 11 ఏళ్లలో సత్పరిపాలన, పరివర్తనపై దృష్టి కేంద్రీకరించామన్నారు. 140 కోట్ల మంది సమష్టి భాగస్వామ్యం, ఆశీర్వాదంతో వివిధ రంగాల్లో శీఘ్ర అభివృద్ధి, ఎంతో పరివర్తన చోటుచేసుకున్నాయని తెలిపారు. బడుగు వర్గాలకు ప్రభుత్వంలో సరైన ప్రాతినిధ్యం లేదని, వారి ప్రయోజనాలకు విరుద్ధంగా తన ప్రభుత్వం పనిచేస్తున్నట్లుగా ప్రతిపక్షాలు చిత్రించే ప్రయత్నం చేస్తున్నాయని.. కానీ తన మంత్రివర్గంలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చోటు కల్పించామన్నారు. సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఈ వర్గాలకు గతంలో ఎప్పుడూ ఇంత ప్రాతినిధ్యం లేదన్నారు. ఆర్థికాభివృద్ధి నుంచి సామాజిక సాధికారత వరకు ప్రభుత్వ కృషి మొత్తం ప్రజలే కేంద్రకంగా, సర్వతోముఖాభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. ఈ సమష్టి విజయానికి గర్విస్తున్నామని.. ఇదే సమయంలో వికసిత్ భారత్ నిర్మాణానికి మొక్కవోని సంకల్పం తీసుకున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో తెచ్చిన మార్పులను వివరించే సమాచారంతో కొన్ని లింకులను ఆయన పోస్టుచేశారు. 'పురోగామి రాజకీయాలను తీసుకొచ్చాం. వికాసవాదాన్ని ప్రధాన స్రవంతిలోకి తెచ్చాం. దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నాం. 15 కోట్ల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇచ్చాం. 4 కోట్ల మందికిపైగా పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చాం. 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. 68 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించాం. కొవిడ్ సమయంలో వివిధ పథకాల కింద 20 కోట్ల మంది మహిళలకు నగదు సాయం అందించాం' అని వివరించారు.

# రాతపూర్వక ఆదేశాలిచ్చానా...

## ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినట్లు ఉంటే చూపించాలి

- ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినట్లు ఉంటే చూపించాలి
- నా కింద పనిచేసిన సిబ్బంది.. అరెస్టు సమయంలో ఇచ్చిన వాంగ్మూలాలు చెల్లుబాటు కావు
- ఎవరి ఫోన్లనూ అక్రమంగా ట్యాపింగ్ చేయించలేదు
- ప్రణీత్‌రావు చేసిన పనితో నాకేం సంబంధం?
- అక్కడేం జరిగిందో ఉన్నతాధికారులందరికీ తెలుసు
- సిట్‌తో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వ్యాఖ్యలు



**హైదరాబాద్, జూన్ 9:** తడబాటు లేదు.. భయం, ఆందోళన అసలే లేవు. ప్రశ్నలకు.. ఎదురు ప్రశ్నలే సమాధానాలు. విచారణ తీరునంతా ముందే ఊహించినట్లు ఎదురుదాడి ధోరణి. మరీ లోతుగా ప్రశ్నిస్తే.. సమాధానాల దాటవేత. ఇదీ.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు సిట్ అధికారుల ఎదుట వ్యవహరించిన తీరు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పలు మలుపుల తర్వాత ఎట్టకేలకు సోమవారం సిట్ అధికారుల ముందు విచారణకు ప్రభాకర్‌రావు హాజరయ్యారు. తాను ఎవరి ఫోన్లనూ అక్రమంగా ట్యాపింగ్ చేయించలేదని తెలిపారు. ఇందుకు సంబంధించి తాను రాతపూర్వకంగా ఇచ్చిన ఆదేశాలేవైనా ఉంటే చూపించాలన్నారు. తన కింద పనిచేసిన సిబ్బంది.. అరెస్టు సమయంలో ఇచ్చిన వాంగ్మూలాలు చెల్లుబాటు కావన్నారు. తనపై ఇంకా ఉన్నతాధికారులు ఉన్నారని, ఆనాడు ఏం జరిగిందో వారందరికీ తెలుసనని పేర్కొన్నారు. మొత్తంగా సిట్ విచారణ జరిగే తీరుపై పూర్తి అవగాహనతో వచ్చిన ప్రభాకర్‌రావు.. పోలీసుల ప్రశ్నలను తిప్పికొట్టినట్లు తెలిసింది. సోమవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీసస్టేషన్‌కు వచ్చిన ప్రభాకర్‌రావును పీఎసలోని రెండో అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయంలో డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలోని బృందం ప్రశ్నించింది. విచారణ మొత్తాన్ని వీడియో రికార్డు చేశారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పనిచేసి ఐజీ స్థాయిలో పదవీ విరమణ పొందిన ప్రభాకర్‌రావు.. ఆపై ఓఎసడీ హోదాలో ఎస్ఐబీలో కొనసాగిన విషయం తెలిసిందే. దీంతో ఆ స్థాయి నేపథ్యం ఉన్న మాజీ పోలీసు అధికారిని విచారించాలంటే అందుకు తగ్గట్లే ప్రశ్నలు ఉండాలని ఉన్నతాధికారులు భావించారు. ఈ మేరకు కేసుపై ఇటీవలే సమీక్ష నిర్వహించి పలు కీలక అంశాల ఆధారంగా ప్రభాకర్‌రావును ప్రశ్నించాలని సిట్ బృందానికి సూచించారు. మరోవైపు ప్రభాకర్‌రావు సైతం పరారీలో ఉన్న పదిహేను నెలల కాలంలో.. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన వారు ఇచ్చిన వాంగ్మూలాలను తెప్పించుకుని అధ్యయనం చేసినట్లు సమాచారం.

# తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర ఒప్పుకోలే..
# అందుకే కాళేశ్వరం చేపట్టాం

**నాడు కేంద్రం, ఏపీ, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా అనుమతివ్వలే**


**ప్రాణహిత -చేవెళ్లలో ఒక లింక్ మాత్రమే మార్చాం.. ఆరు లింకులు యథాత?థం**

**బ్యారేజీల నీటి నిల్వ నిర్ణయం అధికారులదే..**

**మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులతోనే ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్**

**నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ సమయంలోనూ నిర్మాణ స్థలాలు మార్చారు**

**కాళేశ్వరం కమిషన్ విచారణలో మాజీ మంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్, జూన్ 9:** ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించకపోవడం వల్లే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆ ప్రాజెక్టును ఏడు లింకులుగా ప్రతిపాదించగా.. ఆరు లింకులను కాళేశ్వరంలో యథాతథంగా ఉంచామని, ఒకదాన్ని మాత్రమే మార్చామని తెలిపారు. సోమవారం ఆయన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంతో పాటు ఆధారాలను సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అంతర్రాష్ట్ర సమస్యలు, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లో చిక్కుముళ్లు, నిర్మాణ సమస్యల తర్వాతే ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ జరిపామని తెలిపారు. ఇందుకోసం తాను చైర్మన్‌గా, నాటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులతోనే ప్రాణహిత-చేవెళ్లను రీ ఇంజనీరింగ్ చేశామన్నారు. ప్రాణహిత-చేవెళ్లను రెండు ప్రాజెక్టులుగా విడగొట్టామని, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి, ఉమ్మడి ఆదిలాబాద్‌లో నీరందించడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహితగా, మరొకటి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా చేపట్టామని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్లలో ఏడు లింక్‌లు ఉండగా.. అందులో ఒక్క లింక్ తప్ప మిగిలిన లింకులన్నీ యథాథతంగా చేపట్టామన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పడంతోనే మేడిగడ్డకు బ్యారేజీ స్థలాన్ని మార్చామని చెప్పారు. 152 అడుగుల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టడానికి మహారాష్ట్ర అంగీకరించలేదని హరీశ్‌రావు తెలిపారు. ముంపునకు గురయ్యే ప్రాంతానికి పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామంటూ అప్పటి మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హసన్ ముష్రీఫను 2014 ఆగస్టు 23న కలిశానని తెలిపారు. 152 అడుగుల ఎత్తుతో బ్యారేజీని అంగీకరించబోమని మహారాష్ట్ర నాటి సీఎం పృథ్వీరాజ్ చవాన్ ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి లేఖ కూడా రాశారన్నారు. 2007 నుంచి 2014 దాకా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్నా.. అనుమతులు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆ తర్వాత మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. దేవేంద్ర ఫడణవీసతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చలు జరిపారని చెప్పారు. 'నేనే ప్రాణహిత-చే వెళ్ల ముంపునకు వ్యతిరేకంగా ఉద్యమించా. అలాంటి నేనే అనుమతులు ఎలా ఇస్తా?' అని ఫడణవీస్ పేర్కొన్నారని తెలిపారు. ఇక తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. అందులో 63 టీఎంసీలు ఎగువ రాష్ట్రాల వాటా అని సీడబ్ల్యూసీ 2015 మార్చి 4న లేఖ రాసిందన్నారు. మహారాష్ట్ర అభ్యంతరాలు, నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ లేఖతో రీ ఇంజనీరింగ్ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

# సామాజిక బాధ్యతగా ఎలక్ట్రిక్ బస్సులు

**ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**



**సూర్యాపేట అర్బన, జూన 9:**
సామాన్యుల రవాణా అవసరాలు తీరుస్తూనే పర్యావరణ పరిరక్షణలో భాగ ంగా సామాజిక బాధ్యతగా ఆర్టీసీలోకి పెద్దసంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో 45 ఎలక్ట్రిక్ బస్సులను శాసనమండలి చైర్మన గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సోమవా రం ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట డిపోకు 79 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేయగా వాటిలో 7 డీలక్స్, 72 ఎక్స్‌ప్రెసలు ఉన్నాయని, ప్రస్తుతం 45 ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క బస్సు కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగ నియామకం చేపట్టలేని పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వేలాది బస్సుల కొనుగోలు, వేలాది ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ఆడపడుచులందరినీ మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా ఉచితంగా తీసుకెళ్తున్నామన్నారు. దీని ద్వారా ప్రతిరోజూ రూ.6.88 కోట్లు ఆడపడుచులు ఆదా చేస్తున్నారని, ఆ డబ్బులను ప్రభుత్వం నేరుగా ఆర్టీసీకి జమచేస్తుందన్నారు. దీంతో ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తుందన్నారు. ఇప్పటివరకు 182 కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించారని, ప్రభుత్వం ఆర్టీసీకి సుమారు రూ.6200 కోట్లు చెల్లించిందన్నారు. ఆర్టీసీ అభివృద్ధి అక్కాచెల్లెల ఆశీర్వాదం, ప్రభుత్వ నిర్ణయం మహాలక్ష్మి పథకంతో సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత సేవలు అందించి ఆర్థికంగా ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని శాసన మండలి చైర్మన గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యం నుంచి వాతావరణాన్ని కాపాడుకునేందుకు ఎలక్ట్రిక్ బస్సులను అందిస్తున్నాయన్నారు.

# శాఖలపై కసరత్తు

**కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ**

**న్యూఢిల్లీ, జూన్ 9:** తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏశాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుధీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటా యించే అంశంపై సమాలోచన జరిగినట్టు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది.

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
మంగళవారం 10-6-2025



# మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే

## స్థితప్రజ్ఞత సాధించడానికి యోగా అద్భుత ప్రక్రియ: ఎమ్మెల్యే




**తెలుగు - వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** రూ.40 లక్షల వ్యయంతో ఆధునీకరించిన పెదపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు.సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెదపూడి లో నిర్వహించిన యోగాంధ్ర అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ యోగా అనేది భారతీయసనాతన సంస్కృతిలో అంతర్భాగమని ,ఒక మనిషి స్థిత ప్రజ్ఞత సాధిం చడానికి ఒక అద్భుత మైన ప్రక్రియ యోగా అని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి ఒక్కరు యోగా ప్రాముఖ్యత, విశిష్టత అర్థం చేసుకోవాలని అన్నారు.యోగా ఏదో ఒక కులం, మతం, ప్రాంతానికి సంబంధించిన ప్రక్రియ కాదని ప్రపంచమంతా విస్తరించిందని తెలిపారు.యోగాతో జీవనశైలి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని దీంతో ఆరోగ్యకరంగా మనిషి ఎక్కువ కాలం జీవించవచ్చని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి, ఎంపిడివో కొవ్వూరి నరేంద్ర రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఎమ్ఎస్ఎన్ రెడ్డి, సూర్యకుమారి, ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్సీఐ కాలనీ

# పాదయాత్ర చేసిన మియాపూర్ డివిజన్ గౌరవ కార్పొరేటర్

ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీ ఉప్పలపాటి శ్రీకాంత్ గారు మాట్లాడుతూ.. ఎఫ్సీఐ కాలనీ ప్రగతి ఎనక్లేవ్, మియాపూర్ విలేజ్ వాసుల విజ్ఞప్తి మేరకు ఈ రోజు కాలనీలలో జలమండలి అధికారులతో కలసి పాదయాత్ర చేయడం జరిగినది అని,కాలనీలలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యలను పరిశీలించడం జరిగినది అని, కాలనీలలో అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరుస్తామని, పొంగుతున్న మ్యాన్ హోల్ ల వద్ద పునరుద్ధరణ చేస్తామని, సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని, కాలనీల వాసులకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ గారు తెలిపారు. అసం పూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ పనుల ,మంచినీటి లీకేజీ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని, సమస్యలను త్వరలోనే పరిష్కరించాలని అధికారులకు తెలియచేసారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలో మీకు అందుబాటులో ఉంటానని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని కార్పొరేటర్ శ్రీకాంత్ గారు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ సునీత గారు, వాటర్ వర్క్స్ వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, సూపర్వైజర్ లింగయ్య, హర్షద్, మియాపూర్ డివిజన్ మహిళా




అధ్యక్షురాలు సుప్రజ, స్థానిక నాయకులు ఉమాకిషన్, రాఘవేంద్ర రెడ్డి, శ్రీనివాస్, పాండు, రాంబాబు, ఉమమహేశ్వర్ రావు, శ్రీనివాస్, శివకుమార్, ఏబీఎన్ మూర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# సోలీపూర్ ప్రభుత్వ, గ్రామకంఠ భూములకు రక్షణ కల్పించండి

## కలెక్టర్ కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేయాలి - ప్రజావాణి లో పరిష్కారం అవుతాయా

## లేక టైంపాస్ కు పెడుతున్నారా..?



సోలిపూర్ గ్రామస్తులు సింగపాగ జంగయ్య, సింగపాగ శ్రీశైలం డిమాండ్ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం సోలిపూర్ గ్రామంలో ప్రభుత్వ మరియు గ్రామకంఠ భూములను పూర్తి సర్వే చేసి వాటికి రక్షణ కల్పించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ప్రజావాణిలో కూడా పరిష్కారం లభించడం లేదని సోలిపూర్ గ్రామస్తులు సింగపాగ జంగయ్య, సింగపాగ శ్రీశైలంలు ప్రజావాణి తీరుపై విమర్శలు గుప్పించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో సదరు అంశంపై రెండోసారి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విడుదల చేసిన మీడియా ప్రకటనలో మాట్లాడుతూ.. ఇదే సంవత్సరం మార్చిలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన నేటి వరకు ఎటువంటి స్పందన లేకపోవడంతో మళ్లీ ఈరోజు జిల్లా ప్రజావాణిలో ప్రభుత్వ మరియు గ్రామకంఠ భూముల పరిరక్షణ కోసం మళ్లీ ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు సోలిపూర్ గ్రామస్తులు సింగపాగ జంగయ్య, సింగపాగ శ్రీశైల ంలు మీడియాతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగపాగ జంగయ్య, సింగపాగ శ్రీశైలం, మాట్లాడుతూ.. సోలిపూర్ గ్రామం (ప్రస్తుతం షాద్ నగర్ మున్సిపాలిటీ 5 వార్డు) శివారులో సర్వే నెంబర్ 01, 102 ప్రభుత్వ,గ్రామకంఠ భూమిని కొంతమంది ఆక్రమించి గేదెల షెడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. మరియు అక్రమ ఇంటి నిర్మాణాలు చేయుటకు ప్రయత్నిస్తున్నారనీ అంతేకాకుండా సదరు భూమిని ఆక్రమిస్తున్నారని అంతేకాకుండా సర్వేనెంబర్ 98, 99,100, 100/ఆ, 101లోగల భూమిలో కొందరు నూతనంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారనీ వివరించారు. అయితే అట్టి వెంచర్ నిర్వాహకులు గ్రామంలోని కొందరి భూ అక్రమాదారుల అండతో వెంచర్ భూమికి అనుకొని ఉన్న ప్రభుత్వ గ్రామకంఠ భూమిని కొంత భాగం ఆక్రమించుకొని ప్రభుత్వానికి ఇచ్చే 10 శాతం భూమిని ఈ ప్రభుత్వ మరియు గ్రామకంఠం భూమిలో చూపించే అవకాశాలు ఉన్నాయనీ కాబట్టి ప్రభుత్వ మరియు గ్రామ కంఠభూమి ఎంత ఉన్నదో పూర్తిగా సర్వే చేసి వాటికి హద్దులు పాతలని గత సంవత్సరం నాలుగో తేదీ జూలై మాసంలో ఫరూఖ్ నగర్ మండల తహాసిల్దార్, సర్వేయర్ లకు దరఖాస్తు చేయగా గత డిసెంబర్ మండల సర్వేయర్ తమ గ్రామానికి వచ్చి ప్రభుత్వ మరియు గ్రామకంఠ భూమి సర్వేచేసి కొన్నిచోట్ల హద్దురాళ్లు పాతి కొన్నిచోట్ల సర్వే రాళ్లను పాతకుండా వెళ్లిపోయినారన్నారు. మండల సర్వేయర్ ప్రభుత్వ మరియు గ్రామకంఠ భూమిలను సర్వే చేసిన రిపోర్ట్స్ ఇంత వరకు ఇవ్వలేదనీ సర్వే నెంబర్ 102లో మదిగొని కుంట సర్వే నెంబర్ 101,102, భూమిని సర్వే చేసి హద్దులు పాతినప్పటికీ ప్రభుత్వం గ్రామకంఠ భూముల దౌర్జన్యంగా మాదిగోని కుంట భూమిని అక్రమంగా ఆక్రమించారన్నారు. వీరందరూ రాజకీయ పలుకుబడి గతంలో సోలిపూర్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు వీరందరూ సర్పంచిగా ఉప సర్పంచ్ గా వివిధ రాజకీయ పదవులు అనుభవించిన వారే ఇందులో (ఒకరు రెవెన్యూ డిపార్ట్మెంట్ లో ఉద్యోగంలో ఉండి కీలక పాత్ర పోషించి) సోలిపూర్ గ్రామంలో ప్రభుత్వ గ్రామకంఠ భూములతో పాటు సోలిపూర్ గ్రామ శివారులోని అన్ని భూములన్నిటికీ మూల కారణం పై తెలిపిన వ్యక్తులపై ఇన్ని ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఇంత కూడా స్పందన లేదంటే వాళ్లు నిజంగానే ప్రభుత్వ గ్రామకంఠ భూములను అక్రమంగా ఆక్రమించుకున్నది నిజం అవుతున్నదనీ నిజంగా మీ పట్టా భూములు అయితే ఈ ప్రభుత్వ గ్రామకంఠ భూములను సర్వే చేసిన సర్వేయర్ పై ఎందుకు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తారు అంటే మీరు అక్రమంగా ఆక్రమించుకున్నది నిజమే అని ఒప్పుకుంటున్నారు కదా అందుకే ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని వారు స్పష్టం చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తే అధికారులు స్పందిస్తారా లేదా ఇప్పటికైనా తమకు సమాధానం కావాలని తెలిపారు. ప్రజావాణిలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రతిక్ష ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు

# నేడు షాద్ నగర్ కు మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్‌ల రాక

## షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్

## జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ఏర్పాట్లు - షాద్ నగర్ ఈడెన్ ఫంక్షన్ హాల్ లో కార్యక్రమం

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ, ఆయా విభాగాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు హాజరుకావాలని పిలుపు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కు మంగళవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లు వస్తున్నారని షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ వెల్లడించారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు షాద్ నగర్ పట్టణానికి ఉదయం 9 గంటలకు మీనాక్షి నటరాజన్ తో పాటు టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లు వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి పట్టణ చౌరస్తా వరకు పాదయాత్రగా ర్యాలీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చౌరస్తాపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం అక్కడి నుండి స్థానిక హీడెన్ ఫంక్షన్ హాల్ లో జరిగే జై బాపు జై భీమ్ జై సంవిధాన్



కార్యక్రమంలో వారు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి గ్రామాల నుండి ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తెలిపారు. పార్టీ ఆయ విభాగాల శ్రేణులతో పాటు అదేవిధంగా ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు..

# విద్యా వ్యవస్థలో నాణ్యత ప్రమాణాలు పెంచేందుకే ప్రతిభ అవార్డు: ఎమ్మెల్యే నల్లమిల్లి




**తెలుగు - వెలుగు, తూ.గో జిల్లా బ్యూరో (అనపర్తి, రాజమహేంద్రవరం):**
విద్యా వ్యవస్థలో నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు షైనింగ్ స్టార్స్ అవార్డు-2025 పేరిట విద్యార్థులను సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు "షైనింగ్ స్టార్స్" ప్రతిభ అవార్డులు - 2025 పేరిట మెడల్స్, అభినందన పత్రాలు అందించడం జరిగింది. సోమవారం శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ఫంక్షన్ (రాజమహేంద్రవరం) హాల్ లో తూర్పుగోదావరి జిల్లా ఇంచార్జ్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్,సిటీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చియ్య చౌదరి,ఆదిరెడ్డి శ్రీనివాస్ కలెక్టర్ పి ప్రశాంతి అవార్డ్స్, మెడల్స్, అభినందన పత్రాలు విద్యార్థులకు అందించేసి, సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇంకా పలువురు జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ కమిషనర్, జాయింట్ కలెక్టర్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామలింగేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఉజ్వల్ రెడ్డి

**జహీరాబాద్ తెలుగు వెలుగు ప్రతినిధి జూన్ 9**



జహీరాబాద్ పట్టణంలోని నారాయణ నగర్ కాలనీలో ఆదివారం శ్రీ రామలింగేశ్వర స్వామి ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు శక్తి సామర్థ్యాలను పెంచుకోవాలి

## షాద్ నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత


## పవర్ క్వీన్స్ ఫిట్ నెస్ క్లబ్ ను ప్రారంభించిన ఆర్డీవో



మహిళలు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకొని ఆరోగ్యవంతంగా జీవించాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత సూచించారు. సోమవారం షాద్ నగర్ పట్టణంలో ఎస్.ఆర్.కె ఫిట్ నెస్ క్లబ్ జిమ్ అధినేత షారుక్ ఖాన్ సారథ్యంలో పవర్ క్వీన్స్ ఫిట్ నెస్ క్లబ్ ను స్థానిక ఆర్డిఓ ఎన్ఆర్ సరిత స్థానిక మహిళలతో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్ అధినేత షారుఖ్ ఖాన్ ఆర్డీవోకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం జిమ్ లో ఏర్పాటుచేసిన పలు యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సరిత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున అత్యాధునిక జిమ్ ఏర్పాటు చేయడం మహిళల సాధికారతకు పట్టం కట్టే విధంగా ఏర్పాట్లు చేయడం ఎంతో అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. మహిళలు ఆరోగ్యంగా పటిష్టంగా ఉన్నప్పుడే సమాజంలో మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. మహిళలకు ప్రత్యేకంగా జిమ్ ఏర్పాటు చేయడం విశేషమని అభినందనలు తెలిపారు..

# తడిచెత్త, పొడిచెత్త పై అవగాహన కార్యక్రమం

## పాల్గొన్న రంగారెడ్డి జిల్లా జేడీ సంధ్య, మున్సిపల్ కమీషనర్ సునీతా రెడ్డి



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 11వ వార్డులో మున్సిపల్ కమీషనర్ సునీత రెడ్డి అధ్యర్యంలో తడి చెత్త, పొడి చెత్త అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా జేడీ సంధ్య పాల్గొని కాలనీవాసులకు దీనిపై అవగాహన కల్పించి తడి చెత్త, పొడి చెత్త ను ఏ విదంగా వేరు చేసి మున్సిపాలిటీ వారు ఇచ్చిన బకెట్ లలో వేయాలి దానిపై వివరించారు.వర్షాకాలం లో రోగాలు ప్రబల కుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా జేడీ సంధ్య, మున్సిపల్ కమీషనర్ సునీత రెడ్డి, ఎఈ రాయుడు, ఏఈ సాయికిరణ్, ఆర్ పి భరతమ్మ, మాజీ కౌన్సెలర్ పిల్లి శారదా శేఖర్, జవాన్, లింగం మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
మంగళవారం 10-6-2025



# ముదిరాజులకు మాటిచ్చి నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి



పాలాభిషేకం చేసిన షాద్ నగర్ ముదిరాజ్ సంఘం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు

వాకిట శ్రీహరి ముదిరాజ్ కు మంత్రి పదవి ఇచ్చినందుకు హర్షం షాద్ నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో షాద్ నగర్ చౌరస్తాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే శంకర్ కు ముదిరాజుల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజుకు ఇచ్చిన మాట ప్రకారం ముదిరాజులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించినందుకు షాద్ నగర్ ముదిరాజ్ సంఘం సభ్యులు షాద్ నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ తాలూకా అధ్యక్షులు మంగ వెంకటేష్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు అందెపైలయ్య, అంచె రాములు, సంఘం గౌరవ సలహాదారులు కొంకల చెన్నయ్య, చెట్ల జంగయ్య మరియు సంఘం కోశాధికారి కొండే యాదయ్య, ముదిరాజ్ సంఘం యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ, యువత ఉపాధ్యక్షులు మంగ అశోక్, జాయింట్ సెక్రటరీ గడ్డమీద రమేష్, ఫరూఖ్ నగర్ మండల్ అధ్యక్షులు కుడుముల బాలరాజ్, కేశంపేట మండల్ ఇన్చార్జ్ తీగల గోపాల్, షాద్ నగర్ మహిళా అధ్యక్షురాలు అనసూయ గారు పరూక్ నగర్ మండల్ యువత అధ్యక్షులు బుడ్డా నర్సింలు, నాయకులు తంగడపల్లి శంకర్ మేకల వెంకటేష్ మరియు కార్యవర్గము పిట్టల అంజయ్య, మన్నే రవి, గుగ్గిల రవి, చల్ల భరత్, మంగ మధు, గుడాల గిరిబాబు, మంకాల శ్రీశైలం, మొగిలిగిద్ద భరత్, నీరటి వాసు, రాజ మౌని రాజు ఎలికట్ల రాము రాయికల్ సంద నర్సింహులు, జగదీశ్వర్ మంగ కిరణ్ తేజ్ కార్తీక్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ముదిరాజులు అత్యధిక జనాభా కలిగి ఉన్నారు కాబట్టి స్థానిక సంస్థ ఎలక్షన్లలో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చారు.

# ప్రైవేట్‌లో చదివించి ఆర్థికంగా నష్టపోవద్దు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ - తల్లిదండ్రులకు ఎమ్మెల్యే శంకర్ విజ్ఞప్తి**

**మీ డబ్బులు మీ వద్దే .. మీ పిల్లల భవిష్యత్తు మాదే - లింగారెడ్డిగూడెం ఘనంగా బడిబాట కార్యక్రమం**

ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఏడుగురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉందని, ప్రైవేట్ పాఠశాలలు వద్దని ప్రైవేటులో ఫీజులు చెల్లించి తల్లిదండ్రులు అప్పుల పాలు కావద్దని ప్రైవేట్ వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు .ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామ బడిబాట కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. బడిబాట కార్యక్రమం సందర్భంగా గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులు ఎమ్మెల్యే సమక్షంలో ప్రభుత్వ పాఠశాలలో చేరారు. మండల విద్యాశాఖ అధికారి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు హాజరయ్యారు. బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యా యులతో కలిసి పాల్గొన్న ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యా యులచే విద్యాబోధన ఉంటుందని, విశాలమైన తరగతి గదులు ఉంటాయని, ఆడుకోవ డానికి మైదానాలు, తెలుగు, ఆంగ్లంలోనూ విద్యా బోధన ఉంటుందన్నారు. పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడుదామన్నారు. ప్రైవేట్ లో పిల్లలను అప్పులు సప్పులు చేసి చదివించొద్దని ఆర్థికంగా




నష్టపోతారని ప్రభుత్వ పాఠశాలలో చదివించడం ద్వారా మీ డబ్బులు మీ వద్ద ఉంటాయని పిల్లల భవిష్యత్తు మాత్రం ప్రభుత్వం చేతిలో ఉంటుందని అన్నారు

# ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో "ప్రైవేటు పెత్తనం"

**షాద్ నగర్, ఫరూక్ నగర్ సబ్ రిజిస్టర్ ఆఫీసులో ప్రయివేటు వ్యక్తుల సిబ్బంది జోరు**

**అన్ని తెల్సినా చోద్యం చూస్తున్న ఏసీబి, ఉన్నతాధికారులు - నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహారిస్తున్న ఉన్నత అధికారులు**

అక్కడ ఇక్కడ ఏమో గాని మన షాద్ నగర్ ఫరుఖ్ నగర్ సబ్ రిజిస్టర్ ఆఫీసులలో పరిస్థితి రానురాను రాజు గుర్రం గాడిద అయినట్టు కనిపిస్తోంది. మన షాద్ నగర్ పేరు చెబితే ఏ దేశంలోనైనా గుర్తు పట్టని వారు ఉండరు ఇక్కడ ఎందుకంటే సంచలనాలకు పుట్టినిల్లు పేరు పెట్టినిల్లు మన షాద్ నగర్ క్రైమ్



పరంగా దిశా చట్టం చేసారు. కొన్ని ప్రభుత్వాలు వ్యాపారం పరంగా తీసుకుంటే ఇక్కడ లేని వ్యాపారం పరిశ్రమలు కానీ మైక్రో డాటా సెంటర్లు ఎన్నో పార్మసి కంపెనీలు ఇలా చెప్పు కుంటే పోతే రియల్ ఎస్టేట్ లో మనకు మించిన వారు లేరనట్టుగా ఒక దశలో షాద్ నగర్ ఉన్నది. కానీ ఇక్కడ వచ్చే అధికారులు బదిలీ అయి వచ్చినాక మంచిగానే ఉంటారు ఒక నెల గడిచిన తరువాత వచ్చే ప్రజల అవసరాలను ఆయువు పట్టి వాటికీ క్యాష్ చేసుకుంటారు. అలాగే మరి సబ్ రిజిస్టర్ అధికారుల వరకు వస్తే రాష్ట్రంలో ఒకలాగా మన దగ్గర ఒకలాగా ఉంటది అన్నది అందరికీ విదితమే. చలనం లేకుండా ఉన్న పై ఉన్నత అధికారులు ఇక్కడ అవినీతి జరగట్లేదా అంటే అందరికి కనిపిస్తున్న నోరు మేదపని పరిస్థితి. మరియు కండ్లకు కనిపిస్తున్న ప్రయివేటు సిబ్బంది గత కొన్ని ఏండ్లుగా ఇక్కడే తిష్ట వేసి పని చేస్తున్న ప్రయివేటు సిబ్బంది వీళ్ళకి రోజు వారి జీతాలు ఎక్కడివి ఎక్కడ నుండి ఇస్తు న్నారు..? వీళ్ళని ఎవరు నియ మించారు? ఎందుకు నియ మించారు? ఇలా చెప్పుకుంటూ పోతే వీళ్ళ వసూళ్ళ కోసం వీళ్ళ పై ఆధారపడి సబ్ రిజిష్టర్ రోజు వారి మాములల్లో వీరికి జీతాలు బత్యాలు చెల్లిస్తునరాని అందరికి తెలిసిన అంశమే. వ్యక్తిగత ప్రయివేటు సిబ్బందిని పెట్టుకొని దోచుకుం టున్నారు.. ఇదంతా పై అధికారులకు తెలియ కుండా లెదు ఆలా నిఘా విభాగం అని ఏసీబి అధికారులకు కూడా తెల్సు కానీ పట్టుంచుకునే నాధుడు లేక విచ్చల విడిగా వీళ్ళకు ఇష్టము వచ్చినట్లు ఇష్టం ఉన్న దస్తావేజులను మాత్రమే చేస్తూ అమ్యమ్యలు ఉంటే ఒకలాగా లేకుంటే ఒకలాగా డాక్యుమెంట్లు చేస్తూ ఇప్పుడు స్లాట్ లు షాద్ నగర్ ఆఫీసులో స్లాటు బుక్ అయితే ఫరూఖ్ నగర్ కు సంబంచి అక్కడ సబ్ రిజిస్టర్ అధికారి లేని అక్షేపణలు చేసి ఫరుఖ్ నగర్ లో చేయించుకో అంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఈయన ఒక కొత్త చట్టంకు తెర లేపారు. ఫరుఖ్ నగర్ ఎస్ఆర్ఓ నేను ఏమి తక్కువ కాదు అంటూ ఒక దస్తావేజు రిజిష్ట్రీ కావాలంటే ఈయన దగ్గర పడిగాపులు కాయాలి ప్రదక్షణలు చేయాలి. దేవుడు వరమిచ్చినా పూజారులు వరం ఇవ్వాలి అన్నట్టు వీళ్ళ దయతో రిజిష్టర్ చేసుకోవాలి. ప్రభుత్వం రెవెన్యూ మార్గాలు పెంచండి అంటే వీళ్ళు మన ప్రాంత వాసులను ఒక ఆట ఆడుతున్నారు ఇక ప్రభుత్వం అయినా ఏసీబి అధికారులు అయినా ఉన్నత అధికారులు అయినా వీరి పై దృష్టి సారించి వీళ్ళను ఇక్కడ నుండి బదిలీ అయినా లెదా వీరి పై కఠిన చర్యలు తీసుకోవాలి అని షాద్ నగర్ నియోజక వర్గ ప్రజలే కాకుండా ఇతర ప్రాంత ప్రజలు కూడా కోరుకుంటూన్నారు ఎ మేరకు చర్యలు ఉంటాయో వేచి చూడాలి. ఉదయం వసూళ్లైన అమ్యమ్యాలు సాయంత్రానికి ప్రైవేట్ సిబ్బందితో వసూలు చేయిస్తారు ఎందుకంటే వాళ్లే కీలకం. ప్రైవేటు వర్గాల పెత్తనమా మజాకా

# నిద్ర లేవాలి మహిళా లోకం

**ఆవిష్కరించాలి నారీ చైతన్యం -బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్**






మహిళలోకం నిద్రలేవాలి.. నవచైతన్యం ఆవిష్కరించాలి.. మహిళలు రాజకీయ, సామాజిక రంగాలలో చైతన్యంతో ముందుకు సాగాలి.. అంటూ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మండల మహిళా గ్రామ కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో 50 శాతం మహిళలు బీసీలుగా ఉన్నారని, వారందరూ ఏకమై పోరాడితే అనుకున్నది సాధించగలమని ఆమె పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మహిళలకు నిరంతరం అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర అప్ప, కురుమయ్య, ప్యాట శ్రీకాంత్, యాదయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

**ఎంపిక ఇలా..**

జిల్లేడు చౌదరిగుడా మండల మహిళా అధ్యక్షురాలిగా ప్యాంటు జయ శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలుగా బాలమణి యాదవ్, నస్రిన్, ప్రధాన కార్యదర్శిగా బోయ సంతోష, కార్యదర్శిగా కురువ జయమ్మ, కోశాధికారిగా కురువ యాదమ్మ ఎన్నికయ్యారు. తమ బాధ్యతను అంకితభావంతో నెరవేరుస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# సమాజ అభివృద్ధికి, దేశ భవిష్యత్తుకు విద్య కీలకం

**- షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**

**- బడి పట్ల ప్రజల్లో నమ్మకాన్ని తిరిగి తీసుకురావాలి**

**- బడిబాట కీలకమైన ఒక చైతన్య కార్యక్రమం**

**- షాద్ నగర్ లో బడిబాట కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్**

**- హాజరైన ఉపాధ్యాయులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు**

**- బడిబాట ప్రారంభోత్సవ కార్యక్రమానికి మీడియాకు అందని సమాచారం**

**- విద్యాశాఖ పద్ధతి ఇలా.. చైతన్యం అయ్యేది ఎలా..!?**



విద్య, వ్యక్తిగత శ్రేయస్సుకు మాత్రమే కాదు.. సమాజ అభి వృద్ధికి, దేశ భవిష్యత్తుకు కీలకమైన అంశమని దీనిని కేవలం ఉపాధ్యాయుల భూజాలపైన పెట్టడం మంచి పద్ధతి కాదనీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతి సంవత్సరం 'బడి బాట' కార్యక్రమం జరుపుతుంటుంది ప్రభుత్వమని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక విద్యాశాఖ అధికారి మనోహర్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాలు లాంఛనంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు నాయకులు (మీడియా మినహా) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు ఉపాధ్యాయులు మాత్రమే పాల్గొంటున్నారు కానీ ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మీడియా ప్రతినిధులు కూడా భాగస్వామ్యం అయితే బడిబాట కార్యక్రమం విజయవంతం అవుతుందనీ నిజానికి బడిబాట అనేది ఒక ప్రదర్శన కాదు, బడి పట్ల ప్రజల్లో నమ్మకాన్ని తిరిగి తీసుకురావ డంలో కీలకమైన ఒక చైతన్య కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు, ప్రజాప్రతినిధులు మీడియా కూడా భాగస్వామ్యం అయితే విద్యారంగానికి ఒక కొత్త దిశను తీసుకోని రాగలరన్నారు. సాధారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువగా 'ఇంగ్లీష్ మీడియం స్కూల్' అనే ఆకర్షణకు లోనవుతుంటారు. కానీ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల గురించి, విద్యా ప్రమాణాల గురించి బడిబాట కార్యక్రమాల్లో పాల్గొని, తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడితే వారికి ప్రభుత్వ పాఠశాలల పట్ల గౌరవం కలుగుతుందనీ వీలు అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టే వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అన్ని వర్గాలు ఏకతాటిపైకి వచ్చి కృషి చేస్తే బడిబాట కార్య క్రమం విజయవంతం అయి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిష్టాత్మకమైన బడి బాట కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు ప్రజలు తదితర వర్గాలు భాగస్వాములు అయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్య విధానంలో గత ప్రభుత్వం మార్పు తీసుకు రాకపోవడం నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యవస్థకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తను నియోజకవర్గంలో రావిరాల గ్రామంలో కార్యక్రమంలో కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు 15 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేయడం జరిగిందని ఇది శుభ సూచకమని అన్నారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తే సమాజానికి ఎంతో మంచిదని శంకర్ చెప్పుకొచ్చారు.

**విద్యాశాఖ పద్ధతి ఇలా.. చైతన్యం అయ్యేది ఎలా..!?**

రాష్ట్ర ప్రభుత్వం ఇంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ప్రారంభోత్సవానికి కనీసం మీడియాకు కూడా విద్యాశాఖ అధికారి మనోహర్ సమాచారం ఇవ్వకపోవడం గమనర్హం. బడిబాట కార్యక్రమం ఎంతో చైతన్యవంతమైంది మీడియాలో వీటి గురించి ప్రచారం జరిగితే ఎంతో లాభం చేకూరుతుంది. కానీ అధికారి మాత్రం మీడియాకు చెప్పా పెట్టకుండా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదగా కార్యక్రమాన్ని మమ అనిపించారు. అసలు బడిబాట కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభిస్తే ఎంతో గొప్పగా ఉండాల్సిన అవసరం ఉంటుంది కానీ అధికారులు మీడియాకు కనీసం సమాచారం కూడా ఇవ్వకపోవడం పట్ల విస్మయం వ్యక్తం అవుతుంది. విద్య అభివృద్ధి పట్ల అధికారికి ఉన్న నిబద్ధత ఇంత "మనోహరం"గా ఉంటుందా అని విశ్వం వ్యక్తం అవుతుంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, శ్రీధర్ రెడ్డి, నందిగామ సురేష్, భాగ్యమ్మ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలకు మంత్రివర్గములో చోటు కల్పించని కాంగ్రెస్ ప్రభుత్వం

**కాంగ్రెస్ ప్రభుత్వం పై నరోత్తం ఫైర్.**



జహీరాబాద్ తెలుగు వెలుగు ప్రతినిధి జూన్ 9 కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ముస్లింలపై ప్రేమ లేదన్నది నిన్న బయటపడిందని టీఎస్ఎస్ సి సి డి సి. మాజీ చైర్మన్ వై .నరోత్తం ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీల సంఖ్య సుమారు 15% వరకు ఉంటుంది వారి ఓట్లను దండుకున్నారు కానీ వారికి ప్రాధాన్యత కల్పించలేదన్నారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో రెండుసార్లు మంత్రివర్గంలో చోటు కల్పించారన్నారు. ఉప ముఖ్యమంత్రి హోదా ఇచ్చి ముస్లిం సోదరులకు ప్రాధాన్యత కల్పించిందన్నారు. మరియు నలుగురికి ఎమ్మెల్సీలు హోదా కల్పించి గౌరవించింది కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దానికి విరుద్ధంగా ముస్లిం సోదరులను పట్టించుకోవడం లేదన్నారు. కాబట్టి ముస్లిం సోదరులు ఇది గమనించాలని కాంగ్రెస్ పార్టీ మాటలకు మోసపోవద్దని మైనారిటీలను అక్కున చేర్చుకున్నది ఎవరో తెలుసుకోవాలని నరోత్త%శీ% అన్నారు. ఈ కార్యక్రమంలో పర్వేజ్ పటేల్, మహమ్మద్ సలీం, సోహెల్, నబి సాబ్ లు ఉన్నారు.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# సీఎం సాబ్ ఏ క్యా హై

- ముస్లిం వర్గం నుంచి ఒక్కరికైనా మంత్రి పదవీ అవకాశం కల్పించరా..?
- షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు అంజద్ గోరి



రాష్ట్ర ప్రభుత్వంలో మరో ముగ్గురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడం సంతోష ంచదగ్గ విషయమని అయితే ముస్లిం ప్రజల అండతో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పటిష్టంగా ఉందని అలాంటి ముస్లింలకు ఒక్క మంత్రి పదవి కూడా కేటాయిం చకపోవడం బాధాక రమని షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు అంజద్ గోరి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. గత ఎన్నికల్లో ముస్లిం ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అన్ని నియోజకవర్గాల్లో మంచి ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ ప్రజలు తమను ఉద్ధరించే మైనార్టీ శాఖ తరపున ఒకరికైనా మంత్రి పదవి లభిస్తుందని ఆశగా ఎదురుచూశారని గుర్తు చేశారు.అయినప్పటికీ రెండోసారి క్యాబినెట్ విస్తరణ ఉండగా మైనార్టీలకు మొండి చేయి లబి ంచడం వల్ల అనేకమంది మైనార్టీలు అసంతృప్తితో ఉన్నారని అంజద్ గోరి తెలిపారు.తను కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలని అయినా సమాజంలో తన ప్రజలు ఏమనుకుంటున్నారు ప్రభుత్వానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తను కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించడం లేదని కాకపోతే మైనార్టీ ప్రజలను తరపున ఒక సలహా ఇస్తున్నట్లు అంజత్ గోరి పేర్కొన్నారు. మంత్రివర్గ కూర్పులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమ ప్రాధాన్యం దక్కలేదనీ కొన్ని జిల్లాలకు మూడేసి మంత్రి పదవులు దక్కితే, కొన్ని ఉమ్మడి జిల్లాలకు ఒక్క మంత్రి పదవి కూడా రాలేదనీ ఖమ్మం జిల్లాకు మంత్రులు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తు న్నారన్నారు. విస్తరణతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కినట్టు అయిందనీ ఇప్పటికే జిల్లా నుంచి మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ఉన్నారనీ తాజాగా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి దక్కిందనీ ఇక వీటి తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఇప్పటికే కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, కొల్లాపూర్ నుంచి జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్నారనీ తాజాగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వరించిందన్నారు. ఇక ఉమ్మడి వరంగల్ నుంచి సీతక్క, కొండ సురేఖ మంత్రులుగా ఉన్నారనీ నల్లగొండ జిల్లా నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. తాజా విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్‌కు స్థానం దక్కగా, ఆ జిల్లా నుంచి ఏకైక మంత్రిగా ఆయన వ్యవహరిస్తారనీ తెలిపారు. ఇక కనీసం ఒక్క మంత్రి పదవి కూడా లేని ఉమ్మడి జిల్లాలుగా నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ లుంటాయనీ ఈ మూడు ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కరికి కూడా మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారని, ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఈ తరహా రాజకీయ వివక్ష ఏనాడూ లేదని ఆయా జిల్లాల కాంగ్రెస్ నేతలే వాపోతున్నారనీ ఇది నిజమని దీనిని అధిష్టానం గ్రహించాలని తెలిపారు.

**ఇక అసలు విషయానికి వస్తే..**

రాష్ట్ర చరిత్రలో ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక రాష్ట్రంలో కూడా 18 నెలలపాటు ముస్లి వర్గానికి మంత్రి పదవి లేకపోవడం ఇదే తొలిసారనీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంఖ్యాపరంగా మైనార్టీల్లో ముస్లింలు అధికంగా ఉంటారనీ, ఈ వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తుంటారు. కానీ, ఈసారి ముస్లిం వ్యక్తికి మంత్రివర్గంలో స్థానం దక్కలేదనీ దీంతో అనేకమంది మైనార్టీ వర్గాలు ఈ అంశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయని పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణ మళ్లీ ఎప్పుడు జరుగుతుందో తెలియదు. విస్తరణ జరిగినా మైనార్టీలకు స్థానం ఉంటుందో, లేదో కూడా స్పష్టత లేదనీ మైనార్టీ సమాజం అంతర్గతంగా ఎంతో అవమానంగా భావిస్తుందని చరిత్రలో ఎప్పుడు ఇలాంటి సమస్య మైనార్టీలకు ఎదురు కాలేదని అంజద్ గోరీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని రాష్ట్ర వ్యాప్తంగానే కాదు దేశవ్యాప్తంగా మైనార్టీలు మెజార్టీ వంతు కాంగ్రెస్ వెంట ఉన్నాయని భవిష్యత్తులో ఉంటాయని కాకపోతే ఇలాంటి సమస్యల వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తుందని మైనార్టీకి మంత్రి పదవి వెంటనే కేటాయించాలని అంజాద్ గోరి డిమాండ్ చేశారు.

## జెండాను మోద్దాం జెండా ఎగురవేద్దాం

**జిల్లేడు చౌదరిగుడా మండలంలో బీసీ సేన**

**మండలంలో పురుష కమిటీల ఏర్పాటు**

**అసెంబ్లీ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప**





జెండాలు మోయడమే కాదు.. జెండాలు ఎదురవేయాలి.. బీసీలలో రాజకీయ, సామాజిక చైతన్యం తీసుకురావాలి.. ఇది జరగాలంటే కలిసికట్టుగా ముందుకు సాగాలి.. ప్రభుత్వాలకు మన సత్తా ఏమిటో చాటాలి.. అంటూ బీసీ సేన నాయకులు పిలుపునిచ్చారు. జిల్లేడు చౌదరిగుడా మండలంలో నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో బీసీ సేన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది బీ సీలు చైతన్యవంతులై ముందుకు సాగాల్సిన సమయం అని అన్నారు. భర్త కృష్ణ పిలుపుమేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో, గ్రామాలలో కమిటీలు వేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్, కార్యవర్గ సభ్యుడు కురుమయ్య, యాట శ్రీకాంత్ లాల్, యాదయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఇదే..**

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన నూతన కమిటీలో మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్ చారి, ఉపాధ్యక్షులుగా కురుమ యాదయ్య, శివ యాదవ్, మురుగని నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా ఎండి మెహమూద్, కార్యదర్శులుగా బోయ యాదయ్య, కురుమ శేఖర్, కోశాధికారిగా సాయి కొండ యాదవ్, సభ్యులు గా కొండ వెంకట రాములు, కురుమ ఆంజనేయులు, చాకలి గణేష్, రామసాని ఆంజనేయులు నియమించబడ్డారు

## శంకర్పల్లి మున్సిపాలిటీ వ్యవసాయ మార్కెట్ సర్వ సభ సమావేశం



**తెలుగు వెలుగు జూన్ 9**

వ్యవసాయ మార్కెట్ సమావేశం లో వైస్ చైర్మన్ కాసెట్టి చంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రజలకు ఏ ఇబ్బంది కాకుండా చూసుకోవాలని మరియు వర్షాలు పడే అవకాశం ఉన్నాయి కాబట్టి ప్రజలు జాగ్రత్త పాటించాలని సూచించారు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్ అధ్యక్షతన జరిగింది. మార్కెట్ యార్డ్ అభివృద్ధి గురించి చర్చించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ అడుగు ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతోంది

**షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్**

**భాగ్యనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ**



హాజరైన మున్సిపల్ కమిషనర్ సునీత, తదితర పట్టణ నాయకులు తెలంగాణ పునర్నిర్మాణ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ప్రతీ అడుగు ప్రజల ఆకాంక్షలకు అద్దం పడుతోందనీ షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ అన్నారు. సోమవారం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ సునీత పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య తదితర కాలనీ నాయకులు హాజరయ్యారు. భూమి పూజ అనంతరం వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మాట్లాడుతూ.. నిరుపేద వర్గాల ప్రజలకు కనీస అవసరమైన నివాస హక్కును ఇవ్వాలని, అట్టడుగు తరగతులకు అభివృద్ధి ఫలాలు అందించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని రేవంత్ సర్కార్ మరింత విస్తృతంగా అమలు చేయాలని నిర్ణయిం చిందన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం విజయవంతంగా అమలవుతోం దన్నారు. ఇప్పుడు అదే పంథాలో గ్రేటర్ హైదరాబాద్లో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన పట్టణాల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవు తోందనీ రేవంత్ రెడ్డి వేసే ప్రతి అడుగు రాష్ట్ర తెలంగాణ పునర్నిర్మాణానికి వైభవ సంకేతాలని మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ సునీత షాద్ నగర్ టౌన్ అధ్యక్షులు కొంకోల్ల చెన్నయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖదీర్ తంగిడిపల్లి శంకర్, బచ్చలి నరేష్, గ్రంథాలయం ట్రెజరరీ కత్తి చంద్రశేఖర అప్ప, చందులాల్ జమాల్పూర్, తార, సందీప్, సాయి, మేకల వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు ఎక్కే బస్సు ఫిట్?గానే ఉందా

**స్కూల్ బస్సులు ఫిట్?నెస్ రూల్స్ పాటించాలన్న అధికారులు - పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం**

**షాద్ నగర్ ప్రాంతీయ ఉప రవాణా శాఖ అధికారి "వాసు" హెచ్చరిక - షాద్ నగర్ లో మొత్తం 108 స్కూల్ బస్సులు**

**80 శాతం బస్సుల ఫిట్ నెస్ పరీక్షలు పూర్తి - ఫిట్ నెస్ లేని 15 స్కూల్ బస్సుల నిరాకరణ**



విద్యాసంస్థల పునః ప్రారంభానికి సమయం ఆసన్నమైంది. విద్యార్థుల రవాణాకు విని యోగించే వాహ నాలకు తప్పనిసరిగా ఫిట్ నెస్(సామర్థ్య పరీక్షలు) నిర్వహించి, ఆర్టీఏ కార్యాలయం? నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. అయితే ఫిట్నెస్ లేని ఏ బస్సుల కైనా అనుమతి ఉండబోదని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్టీఏ అధికారి వాసు హెచ్చరిస్తున్నారు. షాద్ నగర్ లో మొత్తం 108 స్కూల్ బస్సులకు గాను ఇప్పటికే 80 బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించి ధ్రువీకరించారు. అనేక లోపాలు ఉన్న 15 బస్సులకు ఫిట్నెస్ పరీక్షల ధ్రువీకరణను నిరాకరించారనీ తెలిపారు. ఈ రెండు మూడు రోజుల్లో మిగతా బస్సులకు కూడా ఫిట్నెస్ పరీక్షలు పూర్తవుతాయని అధికారి వాసు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కొందరు ఆర్టీఏ అధికారులు ఉదాసీనంగా, ఏజెంట్లు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో 2025 విద్యా సంవత్సరంలో కొన్ని బస్సులు సామర్థ్య పరీక్షలకు కచ్చితంగా అన్ని సౌకర్యాలు ఉంటేనే తప్ప అనుమతించడం లేదు. సామర్థ్య పరీక్షలు చేయించని విద్యా సంస్థల బస్సుల విషయంలో విద్యా సంస్థల యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వడంతో పాటు వాటి వివరాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఆర్టీఏ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టినట్లే.. అందుకే షాద్ నగర్ లో పకడ్బందీగా ఫిట్నెస్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో ఫిట్నెస్ లేని బస్సులను గుర్తించబమని అధికారి వాసు హెచ్చరించారు. సోమవారం కూడా ప్రాంతీయ కార్యాలయంలో పెద్ద ఎత్తున ఫిట్నెస్ పరీక్షలను నిర్వహించారు.

**స్కూల్ బస్సు ఫిట్నెస్ రూల్స్**

15 సంవత్సరాలు నిండిన వాహనాలను స్టూడెంట్స్? రవాణాకు ఉపయోగించకూడదు. స్కూల్ బస్సు పూర్తి కండిషన్‌లో ఉండాలి.విద్యా సంస్థ పేరు, సెల్?ఫోన్ నంబరు, పూర్తి అడ్రస్ బస్సు ఎడమవైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయాలి.ప్రతి విద్యాసంస్థ యాజమాన్యం డ్రైవర్ ఆరోగ్య పట్టిక నిర్వహించాలి.డ్రైవర్ షుగర్, బీపీ, కంటిచూపు వంటి ప్రాథమిక పరీక్షలను ప్రతి 3 నెలలకోసారి చేయించాలి. డ్రైవర్‌కు 5 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉండాలి.అత్యవసర ద్వారం ఉండాలి. దానిపై స్పష్టంగా అత్యవసర ద్వారం అని రాసి ఉండాలి. బస్సుకు సంబంధించిన వైపర్స్, విండ్ స్క్రీన్, పార్కింగ్ లైట్స్, లైటింగ్స్, ఉండాలి. బస్సు టైర్లు కూడా కండిషన్‌గా ఉండాలి. ప్రతి బస్సులో మంటలు ఆర్పే పరికరాలు ఉండాలి. డ్రైవర్‌కు విద్యార్థులు బస్సు ఎక్కడం, దిగడం స్పష్టంగా కన్పించే విధంగా అద్దాలు అమర్చుకోవాలి. ప్రతి బస్సులో అటెండర్ ఉండాలి. బస్సులో ప్రయాణిస్తున్న స్టూడెంట్స్ పట్టిక కూడా ఉండాలి. బస్సులో స్టూడెంట్స్ బ్యాగులు పెట్టుకొనే విధంగా అరలు ఏర్పాటు చేయాలి. కిటికీలకు మధ్యలో లోహపు కడ్డీలు కచ్చితంగా ఉండాలి. ఫుట్‌బోర్డ్‌పై మొదటి మెట్టు భూమికి 325 మిల్లీ మీటర్ల ఎత్తు మించకుండా చూడాలి. అన్ని మెట్లు జారకుండా లోహంతో నిర్మించాలి.

**పట్టుబడితే వాహనాలు సీజ్ - ఆర్టిఏ అధికారి వాసు**

విద్యాసంస్థల ప్రారంభంలోగా బస్సులన్నింటికి సామర్థ్య పరీక్షలు చేయించాలని షాద్ నగర్ ఉప రవాణాశాఖ అధికారి వాసు తెలిపారు. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, తనిఖీలు ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తామని, పరీక్షలకు రాని బస్సులకు సంబంధించి యజమానులకు నోటీసులు పంపిస్తామని వెల్లడించారు..

# ప్రైవేటు పాఠశాలలు కళాశాలల ఫీజులు నియంత్రించాలి

## బి ఆర్ ఎస్ వి స్టేట్ జనరల్ సెక్రటరీ అశ్వంత్ కుమార్



తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి

ప్రైవేటు కళాశాలు మరియు పాఠశాలల్లో ఫీజులను కట్టడి చేయాలనీ వి ఆర్ ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశ్వంత్ కుమార్ డిమాండ్ చేశారు. డొనేషన్ అడ్మిషన్ పేరుతో ప్రవేటు పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల తల్లితండ్రులనుండి విపరీతమైన డబ్బులు వసూలు చేసి చదువును వ్యాపారంగా మర్చుతున్నారని ఫీజులు యూనిఫాం పుస్తకాల పేరొతో మోయలేని ఆర్థికభారాన్ని మోపుతున్నారని అశ్వంత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తు ఎవరికి వారు రాసుకున్న చట్టాన్ని అమలు చేస్తున్నారని విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తున్న ఫీజుల నియంత్రణ పై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయపోవడం దురదృష్టరమని అన్నారు. ప్రవేటు పాఠశాలలు ఇష్టారీతిన ఫీజులు పెంచుతూ లాభార్జన చేస్తున్నాయని విద్యను వ్యాపారంగా మారిస్తే దేశభవిష్యత్ ప్రమాదంలో పడుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందిచి విద్యాహక్కు చట్టాన్ని అమలుపరిచి ప్రవేటు కళాశాలలను పాఠశాలలను కట్టడి చేయాలని యశ్వంత్ కుమార్ డిమాండ్ చేశారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

### ఫరూక్ నగర్ మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

### హాజిపల్లి, చిలకమర్రి, రామకృష్ణాపూర్ గ్రామాల్లో సదస్సులు



భూ భారతిలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను గ్రామాల్లో ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని షాద్ నగర్ తహసిల్దార్ పార్థసారథి, డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ లు సూచించారు. సోమవారం ఫరూక్ నగర్ మండలంలో తహసిల్దార్ పార్థసారథి, డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ ఆధ్వర్యంలో వేరువేరుగా మండలంలోని హాజిపల్లి, చిలకమర్రి, రామకృష్ణాపూర్ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అధికారులను కలుసుకున్నారు. తప్పుల సవరణ, విరాసత్ తదితర ముఖ్యమైన అంశాల విషయంలో రెవెన్యూ సదస్సులో ప్రజలు తమ వద్దకు పరిష్కారం కోసం వస్తున్నారని ఇరువురు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు నిరభ్యంతరంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ప్రజల వద్దకే గ్రామాల్లో సదస్సులు నిర్వహించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకుందని ఇలాంటి గొప్ప అవకాశాన్ని రైతులు ప్రజలు నిర్లక్ష్యం చేయకూడదని వారు కోరారు. ఇలాంటి భూ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావచ్చని వారు ప్రజలకు సూచించారు..

# ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణంపై అవగాహన




సింగరేణి తెలంగాణ తేజ

సింగరేణి మండల పరిధిలోని అప్పయ్యగూడెం గ్రామపంచాయతీలో సోమవారం ఎంపీడీవో అధ్యక్షతన ఇందిరమ్మ లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం మండల పరిధిలోని అప్పయ్యగూడెం గ్రామపంచాయతీలో రైతు వేదికలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం చేపట్టుటకు విస్తీర్ణం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ నాగేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 చదరపు అడుగుల తక్కువ కాకుండా 600 చదరపు అడుగులు మించకుండా సొంత ఇంటి జాగాలో నిర్మాణం చేపట్టాలని కొలతలకు విరుద్ధంగా ఇల్లు నిర్మాణం చేపడితే బిల్లు మంజూరు కాదని తెలిపారు. ఇంటి నిర్మాణంలో భాగంగా సిమెంటు ఇసుక ఐరన్ రాడ్ మొదలైన మెటీరియల్ పై అవగాహన కల్పించడం జరిగిందని, ఇంటి నిర్మాణం చేపట్టే వారు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం నిర్మాణం చేపట్టాలని ఇంటి నిర్మాణం కోసం మహిళా సమైక్య ద్వారా అర్హత గల ప్రతి ఒక్కరికి బ్యాంకు లోను ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హులకు ఇంటి నిర్మాణం కేటాయించడం జరిగినదని ఇంటి నిర్మాణం శరవేగంగా జరిగినచో బిల్లులు వారి ఖాతాలో మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి సురేందర్, ఎంపీ ఓ రవీంద్ర ప్రసాద్, ఏఈ నాగేందర్ ఏపీఎం వెంకటేశ్వర్లు ఏపీవో వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి అట్లూరి లక్ష్మణ్‌కు


# అభినందనల వెల్లువ

తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి



తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని పలువురు అభినందించారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాషిపాక యాదగిరి కూకట్పల్లి డివిజన్ సీనియర్ నాయకులు కుమార్ యాదవ్, కూకట్పల్లి నియోజకవర్గ కాంటెస్ట్ ఎమ్మెల్యే సంజీవరావు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, బొల్లం యాకయ్య తదితరులు శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు.

## తులసి నగర్ సంక్షేమ సంఘం సభ్యులను అభినందించిన వడ్డేపల్లి



తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని అల్లాపూర్ డివిజన్ తులసి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా అధ్యక్షుడు అంకిత్ సింగ్ ,వారి మిత్ర బృందం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వడ్డపల్లి రాజేశ్వరరావు అంకిత్ సింగ్ను వారి బృందాన్ని సన్మానించి అభినం దించారు. కాలనీ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రాజేశ్వరరావు తెలియజేశారు

## చైతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు,వీల్ చైర్స్ పంపిణీ

బయ్యారం,జూన్ 9.



చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమం కోసం ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం సోమవారం చేతన ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు లబ్ధిదారులకు ట్రై సైకిళ్లు,వీల్ చైర్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంచేందుకు,వారిని గొప్పగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందనీ సామాజికంగా బాధ్యత కలిగిన సంస్థల నుంచి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి అని వారు తెలిపారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ వెనిగళ్ళ అనిల్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమమే మా చేతన ఫౌండేషన్ లక్ష్యం.ఈ సాధనాల ద్వారా వారు స్వతంత్రంగా జీవించాలనే ఉద్దేశంతో మేము ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పసుమర్తి రంగారావు,దొడ్డ సీతారామయ్య,చంద్రకాని నవీన్,మాదినేని నరసింహారావు,షేక్ రషీద్, స్వరూప్,రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై రెవిన్యూ సదస్సులు

టేకుమట్ల జూన్ 09



టేకుమట్లమండలంలోని గర్మిళ్ళపల్లి,వెలిశాల గ్రామాలభూసంబంధిత సమస్యలపరిష్కారానికై ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం గర్మిళ్ళపల్లి గ్రామ శివారులో80దరఖాస్తులను,వెలిశాల గ్రామ శివారులో 81భూ సంబంధితదరఖాస్తులను మండలతహశీల్దార్ విజయలక్ష్మి మరియు డిఏఓ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం భూపాలపల్లివారు స్వీకరించినారు.ఈ కార్యక్రమం లో ప్రభుత్వ అధికారులు, రైతులు తదితరులు పాలుగోన్నారు.

## ప్రభుత్వ కళాశాలలను బిజెపి నేతలతో కలిసి సందర్శించిన మాధవరం కాంతారావు



తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కూకట్పల్లి అసెంబ్లీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను సోమవారం భారతీయ జనతా పార్టీ కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న మెరుగైన విద్యా విధానాన్ని,అడ్మిషన్ల ప్రక్రియను సంబంధిత ప్రధానోపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రైవేటు విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు విద్యార్థుల వలసలు పెరుగేలా నూతన సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మెరుగైన విద్యను అందించేందుకు ఏఐ ఆధారిత డిజిటల్ విద్యాబోధన అమలు చేయాలని అదేవిధంగా విద్యార్థులకు మరుగుదొడ్లు, ఆటస్థలంతో పాటు లైబ్రరీ వ్యవస్థను మెరుగు పరచాలని ఈ సందర్భంగా కాంతారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వినోద్ కుమార్ గౌడ్, భగవంత్ రెడ్డి, గోపి, సూరిబాబు, వెంకటరమణ, జగదీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు అభినందనలు తెలిపిన దొడ్ల



తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి

అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జయశంకర్ కాలనీలో జరిగిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపొందిన మహేష్ కాలనీ వాసులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలవగా ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేష్ ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.అలాగే కార్పొరేటర్ మాట్లాడుతూ జయ శంకర్ కాలనీలో త్రాగు నీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందించామని అన్నారు. ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులు కాలనీ ప్రజలందరికీ అన్నివిధాల సహకారాన్ని అందిస్తూ, కాలనీ అభివృద్ధికి తోర్పడాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పిట్ల మీన కుటుంబ సభ్యులను పరామర్శించిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్



తెలుగు వెలుగు(ఏర్గట్ల మండలం) నిజామాబాద్ జిల్లా ఈరోజుకేంద్రములో నిన్న అకస్మాత్తుగా చనిపోయిన మాజీ సర్పంచ్ పిట్ల మీన గారి కుటుంబ సభ్యులను పరామర్శించిన బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ గారు. వీరి వెంట ఏర్గట్ల మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు ( 9-6-25 )

## ఘనంగా బిజెపి నాయకులు వేణు పుట్టినరోజు వేడుకలు



తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి


శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి కే.వేణు పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం రాజేశ్వరరావు వేణు ను శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా వేణును అభినందించి పార్టీ యొక్క పటిష్టతకు అందరిని కలుపునీ పని చేయాలి అన్నారు.

# రైతు లాభంతో కార్పొరేట్లకు నష్టమా



శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా సంవత్సర కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంలో 'బిజినెస్ స్టాండర్డ్' అనే ఒక ఆంగ్ల వాణిజ్య పత్రిక ఆయనను ఇంటర్వ్యూ చేసింది. గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పని చేసి, వ్యవసాయ రంగం పట్ల విశేష శ్రద్ధ చూపిన వాడిగా, కేంద్రంలో ఆయన హయాంలో రైతాంగానికి మంచి జరుగుతుందని మనం ఆశించడం సహజం. కాగా, ఆయన ఇచ్చిన ఈ ఇంటర్వ్యూను పరిశీలిస్తే ఆయన పని చేస్తూన్న చట్రంలో రైతాంగానికి ఆయనైనా ఎవరైనా పెద్దగా ఒరగ పెట్టగలగింది ఏమీ లేదని అర్థం అవుతుంది. మొదటగా అసలు దేశంలో రైతాంగానికి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కావల్సింది ఏమిటి? అనేది ప్రశ్న. దీనికి రెండు జవాబులు ఉన్నాయి: ఒకటి-%-% వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచడం. రెండవది%-% వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను హామీ చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం. ?అనేక దశాబ్దాల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే, హరిత విప్లవం అనంతరం దేశంలో వ్యవసాయ ఉత్పత్తి భారీగా పెరిగినప్పటికీ, వ్యవసాయదారుల స్థితిగతులు మాత్రం రాను రాను దిగజారిపోతున్నాయి. 1970%-%2015ల మధ్య 45ఏళ్ళ కాలంలో గోధుమలకు కనీస మద్దతు ధర కేవలం 19 రెట్లు మాత్రమే పెరిగింది. కాగా, అదే కాలంలో ప్రభుత్వ ఉద్యోగుల ఆదాయాలు 120 రెట్లు, కళాశాల ఉపాధ్యాయుల వేతనాలు 150 రెట్లు, పాఠశాల ఉపాధ్యాయుల ఆదాయాలు 280 రెట్లు పెరిగాయి! అంటే ఇక్కడ, ఉత్పత్తిని పెంచుతూ పోయినా రైతాంగం ఆర్థిక స్థితి మెరుగుపడదని మనకు అర్థం అవుతుంది. ఇందుకే స్వయంగా శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయరంగ 'అనుకూల' పాలనా కాలంలో కూడా మధ్యప్రదేశ్‌లో రైతాంగ సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. వాస్తవానికి శివరాజ్ సింగ్ పాలనా కాలంలో మధ్యప్రదేశ్‌లో వ్యవసాయ రంగం దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా అద్భుతమైన ముందడుగు సాధించింది. అక్కడ ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. ఉదాహరణకు, ఆ రాష్ట్రంలో 2011%-%12లో 149 లక్షల టన్నులుగా ఉన్న వరి, గోధుమలు, ముతకధాన్యాలు, పప్పుధాన్యాల ఉత్పత్తి, 2021%-%22 నాటికి 349 లక్షల టన్నులకు, అంటే రెట్టింపుకు పెరిగింది. ఇది, ఆ రాష్ట్ర వ్యవసాయ రంగంలో సగటున 9.12 శాతం వార్షిక వృద్ధి రేటుకు సమానం. ఇంతగా ఉత్పత్తి సాధించినప్పటికీ రైతాంగానికి వ్యవసాయం మాత్రం లాభసాటి కాలేదు. పైగా, ఈ రికార్డు స్థాయి పంటల ఉత్పత్తితో మార్కెట్‌లో సరఫరా భారీగా పెరిగి ధరలు పతనమయ్యాయి. రైతులు రికార్డు స్థాయి పంటలను పండించినా, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నా%-% అంటే, పంట ఉత్పత్తి పెరిగినా, పడిపోయినా%-% అంతిమ ఫలితం మాత్రం రైతు నష్టపోవడమే అన్నది మధ్యప్రదేశ్ రైతాంగానికి అర్థమయింది. అందుకే 2017లో మధ్యప్రదేశ్‌లోని మాందసూర్‌లో రైతాంగం ఆందోళనలకు దిగింది. గిట్టుబాటు ధరల కోసం, వర్షాభావం వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం కోసం ఉద్యమిస్తోన్న రైతాంగంపై కాల్పులు జరిగాయి, ఆరుగురు రైతులు చనిపోయారు. ఫలితంగా, వ్యవసాయ ఉత్పత్తిలో ప్రగతి సాధించినప్పటికీ, మధ్యప్రదేశ్‌లో 2018 ఎన్నికలలో శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఓటమి పాలయ్యింది. ఈ సమస్యల నేపథ్యంలోనే దేశ రైతాంగం కూడా మూడు రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీని చుట్టుముట్టి ఆందోళనకు దిగింది. ప్రధాని నరేంద్ర మోదీ రైతాంగానికి క్షమాపణ చెప్పి ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. అలాగే కనీస మద్దతు ధర అంశం పైన కమిటీని కూడా ఏర్పరిచారు. అయితే, అనంతంగా సాగుతోన్న చర్చోపచర్చలు, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచనల తర్వాత కూడా, నేటికీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలనే రైతాంగ డిమాండ్ అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఈ విషయంలో ప్రభుత్వ మొండి వైఖరికి కారణం ఏమిటి? ఇంటర్వ్యూలో ఈ అంశంపై శివరాజ్ సింగ్ చౌహాన్ పలుమార్లు జవాబును దాటవేశారు. "మీ ప్రభుత్వం ఉత్పత్తి పెంపుదలపై అతిగా దృష్టిని పెడుతోంది, కాగా భారత రైతాంగం తాలూకు అసలు సమస్య పడిపోతూవున్న వారి ఆదాయాలు" అన్న ప్రస్తావనకు స్పందనగా చౌహాన్: "...ఒక ప్రక్కన మేము 145 కోట్ల జనాభాకు సేవ చేయవలసి ఉంది," అనే అస్పష్టమైన జవాబును ఇచ్చారు. అయితే దీని పరమార్థం స్పష్టమే! "మేము రైతాంగానికి గిట్టుబాటు ధరలను ఇస్తే%-% అది దేశంలోని మిగతా జనాభాకు సమస్య అవుతుంది" అని ఆ మాటల అర్థం. అదెలా? అన్న ప్రశ్నకు జవాబు సులువే. రైతుకు గనుక స్వామినాథన్ కమిటీ సూచించిన తరహాలో గిట్టుబాటు ధరను ఇస్తే %-% అది వినియోగదారులకు ధరల పెరుగుదల రూపంలో 'భారం' అవుతుందనేది%-% ఈ జవాబు అంతరార్థం. అయితే, కనీస మద్దతు ధర విషయంలో ప్రభుత్వం రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోవడానికి కారణం వినియోగదారుల ప్రయోజనమేనా? ఖచ్చితంగా కాదు. ఇదే నిజమైతే మన పాలకులు ప్రజల కనీస అవసరాలపైన కూడా జి.ఎస్.టి వంటి పన్నులను విధించేవారు కాదు. ఈ పన్నుల భారం వలన కూడా, నేడు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగాయన్నది తెలిసిందే. అసలు సమస్య వినియోగదారులది కాదు. కార్పొరేట్ యజమానులది. ఎలాగంటే %-% రైతాంగానికి కనీస మద్దతు ధర ఇవ్వటం వల్ల నగర ప్రాంతాలలో వినియోగదారులకు ధరలు పెరిగాయనుకుందాం. ఈ వినియోగదారుల్లోని అత్యధికులు కార్మికులు, ఉద్యోగులే ఉంటారు. వీరు ధరల భారాన్ని భరించలేక తమ యజమానులను అధిక వేతనాల కోసం డిమాండ్ చేస్తారు. అదీ అసలు కథ! అంటే, రైతుకు మద్దతు ధర ఇవ్వటం వల్ల ఉద్యోగులూ, కార్మికులు అధిక వేతనాల కోసం కార్పొరేట్ల మీద ఒత్తిడి తెస్తారు కాబట్టే, కార్పొరేట్లకు ఇబ్బంది కలుగుతుంది కాబట్టే, ప్రభుత్వం మద్దతు ధరలకు సుముఖంగా లేదు! కార్మికులనూ, ఉద్యోగులనూ సాధ్యమైనంత తక్కువ వేతనాలతో పని చేయించుకోవడం కార్పొరేట్ల స్వభావం. లాభాలను పెంచుకోవడం కోసం వారికి ఇది అవసరం. దీని కోసం నగర ప్రాంతాల్లో నిత్యవసరాల ధరలు సాధ్యమైనంత తక్కువ ఉండటం కూడా వారికి అవసరం. ఇందుకోసమే కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలనూ, ఆర్థిక స్థితిగతులనూ పణంగా పెట్టి, వారి ఉత్పత్తులను తక్కువ ధరకు నగరాలకు తరలిస్తున్నాయి. నేడు అమలు జరుగుతున్న సంస్కరణల సారాంశం ఇదే. గ్రామాలను కొట్టి నగరాలకూ పెట్టడమే! నగరాలకు పెట్టడమంటే అంతిమంగా నగర ప్రాంత కార్పొరేట్లకు దోచిపెట్టడమే! ఈ క్రమంలో గత మూడు దశాబ్దాలుగా రైతాంగానికి వ్యవసాయం నష్టదాయకమై, వారి ఆత్మహత్యలు పెరిగిపోయాయి. అలాగే, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధతను ఇచ్చేందుకు ప్రభుత్వాల అయిష్టత వెనుక మరో కారణం కూడా ఉంది. అది నగర ప్రాంతాల్లోని కార్పొరేట్లకు అవసరమైన కార్మికులు, ఉద్యోగుల సరఫరా. అంటే, గ్రామీణ ప్రాంతాల నుంచి, నగరాలకు తగినంత స్థాయిలో వలసలు ఉండాలీ అంటే, వ్యవసాయ రంగం లాభసాటిగా ఉండకూడదు. అలా ఉంటే రైతు గ్రామాన్ని వదిలి బయటకి రాడు. వ్యవసాయ రంగంలో బతకడం కష్టమైతేనే రైతు వలసకూలీగా మారి నగర బాట పడతాడు. కార్పొరేట్లకు కావల్సింది ఇదే. నగరాలలో మానవవనరుల సరఫరా అధికంగా ఉండాలి. ఉంటేనే ఉపాధి కోసం పోటీ పెరుగుతుంది. పెరిగితేనే ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను తగ్గించే అవకాశం కార్పొరేట్లకు కలుగుతుంది. దీని తాలూకు మరొక కొనసాగింపే %-% ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చివేసే ప్రయత్నం. ఈ పథకం వలన గ్రామాల్లో ఉపాధి పెరిగి నగర ప్రాంతాలకు వలసలు తగ్గుతాయి. దీనివల్ల నగర ప్రాంత కార్పొరేట్లకు కార్మికుల సరఫరాను తగ్గిపోతుంది. శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యక్తిగతంగా ఎంతటి మానవీయ కోణం కలిగిన వారయినా, రైతాంగానికి మేలు కోరుకునే వారయినా, వాస్తవంలో ఆయన వర్గపరిమితులు, రాజకీయ పరిమితులు దానిని అనుమతించవు. ఇక ఇప్పుడు ఈ ప్రభుత్వాల హయాంలో – కనీస మద్దతు ధరకు చట్టబద్ధత అటుంచి, కనీసం అమెరికాతో వాణిజ్య ఒప్పంద చర్చలలో %-% దిగుమతి టారిఫ్‌ల తగ్గింపు పేరుతో – భారత వ్యవసాయ రంగం పూర్తిగా బలిపీఠం ఎక్కదని ఆశించడం మాత్రమే మనం చేయగలిగింది!

# ఎవరికి ఈ సంబురాలు



తెలంగాణ ఆవిర్భవించి పదకొండేళ్లు నిండాయి. కానీ ఉద్యమ కారుల జీవితాలేమాత్రం మారలేదు. వారి కోసం ప్రభుత్వాలు ఇప్పటి వరకూ చేసిందేమీ లేదు. వారి వల్లనేకదా ఈనాడు తెలంగాణకు చెందినవారు పాలకులై రాష్ట్రాన్ని ఏలుతున్నారు! ఉద్యమకారులపై ప్రభుత్వాలకు కృతజ్ఞతా భావన ఎందుకు లేదు? ఉద్యమ కాలంలో చాలామంది తమ విలువైన సమయం, యవ్వనం తెలంగాణ సాధనకే అంకితం చేశారు. మరి తెలంగాణ పాలకులే కదా ఇప్పుడు వారి త్యాగాలను గుర్తించి ఆదుకోవాల్సింది?! మొన్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు.. ప్రభుత్వం తమకు గతంలో ఇచ్చిన హామీల తాలూకు ప్రకటన చేస్తుందని ఉద్యమకారులంతా ఎదురు చూశారు. కానీ వారికి నిరాశే మిగిలింది. 1969 నాటి తొలిదశ ఉద్యమకారులెందరో చనిపోయారు. ప్రస్తుత ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందనే ఆశతో మలిదశ ఉద్యమకారులు బతుకుతున్నారు. కానీ ఈ ఎదురుచూపుల్లోనే ఎందరో ఉద్యమకారుల జీవితాలు రోజురోజుకూ చితికిపోతున్నాయి. ఊరూరా ఒక కాలనీ.. అందులో ఇందిరమ్మ పేరు మీదనో, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ పేరు మీదనో, ఏదో విధంగా పాలకులకు విశ్వసనీయత దక్కేలా ఉద్యమకారులకు గృహాలు నిర్మించి ఇవ్వొచ్చు కదా! నాణ్యమైన వైద్యం నేడు చాలా పిరం అయిపోయింది. హెల్త్ ఇన్సూరెన్సు, బతుకుదెరువుకు ఉపాధి అవకాశాలు కల్పించి ఉద్యమకారులను ఆదుకోవాల్సిన అవసరం పాలకులపై ఉన్నది. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం కనీసం ప్రాథమికంగా ఒక ఐడెంటిటీ కార్డ్ లేదా సర్టిఫికెట్ ఇచ్చి గౌరవించినా, వారి పోరాటానికి కొంత గుర్తింపు, విలువ ఇచ్చినవారవుతారు. ఉద్యమకారులను ఆదుకోవడమంటే.. ఓ పదిమందికి తలో కోటి రూపాయలు, ప్లాట్ ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు. గత ప్రభుత్వం తమ పార్టీకి అనుబంధంగా ఉన్న కొంతమందిని మాత్రమే పట్టించుకున్నది. అసలైన ఉద్యమ సమాజాన్ని పట్టించుకోలేదు. ఈ పరిస్థితిని మారుస్తామంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక రెండో ఏడాది ఆవిర్భావదినోత్సవ వేడుకల్లోనూ ఉద్యమకారులకు అనుకూల ప్రకటనేమీ రాకపోవడం విచారకరం. ఐతే, ఉద్యమకారులు ఇప్పుడు ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు వదులుకుని నిరాశాజీవుల్లా మిగిలిపోతారో లేక తెలంగాణ ఉద్యమంలో చూపిన పోరాట పటిమను ప్రదర్శిస్తారో, లేదా ఇంకేదైనా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకొని తమ హక్కులను సాధించుకుంటారో! ఆ లోపు ప్రభుత్వమే గ్రహించి, వారికిచ్చిన హామీలను నెరవేరిస్తే మరో ఉద్యమం అవసరం ఉండదు.

# మత్తులో తూలుతున్న యువత



ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదు. ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని ప్రస్తావించాలి. 2019లో సంభవించిన సంఘటన ఇది. కొత్తగా పెళ్ళయిన ఒక జంటను, వధువు మేనత్త స్వయంగా తన ఖర్చుపై హనీమూన్ నిమిత్తం ఖతర్‌కు పంపింది. ఆ వధూవరుల బ్యాగులో వారికి తెలియకుండా మాదక ద్రవ్యాలను పంపించగా ఖతర్ విమానాశ్రయంలో బ్యాగేజి పరిశీలన అనంతరం ఆ జంటను అరెస్ట్ చేశారు. ఖతర్ న్యాయస్థానం ఆ అమాయక జంటకు సమారు కోటిన్నర రూపాయల జరిమానా, పది సంవత్సరాల జైలు శిక్ష విధించింది. హనీమూన్ నుంచి వారు ఎన్నాళ్ళకూ తిరిగిరాకపోవడంతో స్వదేశంలో తల్లిదండ్రులు, అత్తమామలు తీవ్రంగా కలవరపడసాగారు. ఒక రోజు ఖతర్ నుంచి ఒక మహిళ ముంబైలోని వధువు తండ్రికి ఫోన్ చేసి మీ కూతురు, అల్లుడు డ్రగ్స్ కేసులో పట్టుబడి జైళ్ళో ఉన్నారని చెప్పింది. హతాశుడైన ఆ తండ్రి ఖతర్‌కు వచ్చి ఏడాదిన్నర పాటు ఒక హోటల్‌లో బస చేసి జరిగిన ఘోరం వివరాలు తెలుసుకున్నాడు. ముంబైలో తన కుమార్తె, అల్లుడి చేతికి బ్యాగేజి ఇచ్చిన వ్యక్తులపై కేసు నమోదయి, సరైన దిశగా విచారణ జరిగినట్లుగా ఖతర్ న్యాయస్థానం భావిస్తే మాత్రమే జంట విడుదలకు ఆవకాశం ఉన్నట్లుగా ఆ దేశ అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఆ తండ్రి భారత్‌కు తిరిగి వచ్చి పోలీస్ స్టేషన్ మొదలు ప్రపధానమంత్రి కార్యాలయం దాకా 17 ప్రభుత్వ శాఖల చుట్టూ తిరిగాడు. మరాఠీ నుంచి ఆంగ్లంలోకి, ఆంగ్లం నుంచి అరబ్బి భాషలోకి మహారాష్ట్ర పోలీసుల ఎఫ్.ఐ.ఆర్., పంచనామాలను అనువాదం చేయించేందుకు లక్షలాది రూపాయలను ఆ కుటుంబం ఖర్చు చేసింది. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్.సి.బి. విచారణ చేసి బ్యాగేజి ఇచ్చిన మేనత్తతో సహా ఆరుగురిని సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేసినట్లుగా ఇచ్చిన నివేదికను దౌత్యవర్గాల ద్వారా ఖతర్‌కు సమర్పించిన అనంతరం అతి అరుదైన కేసుగా ఖతర్ సుప్రీంకోర్టు కేసును పునఃసమీక్షించి జంటను నిర్దోషులుగా ప్రకటించింది. ఈ రకమైన ప్రయత్నం అందరికి సాధ్యం కాదు కదా. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు.మాదక ద్రవ్యాల న్నింటి లోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ (యన్.సి.బి) అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాలకు, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది.

# ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ ధర్నా

**తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేత**

**పాల్గొన్న చర్ల బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు ,పార్టీ కార్యకర్తలు**





**చర్ల, జూన్ 09**

సోమవారం చర్ల మండల కేంద్రంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్నటువంటి తాసిల్దార్ కార్యాలయం నందు ధర్నా కార్యక్రమం నిర్వహించి మెమొరండం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టును ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఖమ్మం జిల్లాకు తరలించుకొని పోవుచున్నార అని ఖమ్మం జిల్లాకు సాగునీరు ఇవ్వడం సరైనదే కానీ భద్రాది కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల రైతాంగానికి సాగునీటి ఇవ్వకపోవడం మాత్రం దుర్మార్గం అని అన్నారు.

ఈ ప్రభుత్వం మేల్కొని భద్రాద్రి జిల్లాకు సాగునీరు అందించవలసిందిగా రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అని అన్నారు అలాగే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచిన అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేస్తామని చెప్పి గ్యారెంటీ కార్డుల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు కాకపోగా సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నది అని అన్నారు . ఈ ప్రభుత్వం మేల్కొని ఆరు గ్యారెంటీలలోని 420 హామీలు తక్షణమే అమలు చేయవలసిందిగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాము అని 6 గ్యారంటీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ సామాన్య ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుందని ప్రభుత్వాన్నీ హెచ్చరిస్తున్నాం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సోయాం రాజారావు మాజీ ఎంపీపీ గీద కోదండ రామయ్య మండల సీనియర్ నాయకులు సయ్యాద్ అజీజ్ ఎడ్ల రామదాసు డివిజన్ యువజన నాయకులు కాకి అనిల్ బీసీ సెల్ అధ్యక్షులు గోరంట్ల వేంకటేశ్వర రావు ఎస్టి సెల్ కార్యదర్శి కారం కన్నారావ్ ఎస్సి సెల్ అధ్యక్షులు కొంబత్తిని రాము యూత్ మండల అధ్యక్ష కార్యదర్శులు అంబోజి సతీష్ కుప్పల నిరంజన్ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కుప్పల సౌజన్య యూత్ నాయకులు కట్టాం కన్నారావు తడికల బుల్లెబయి మెడబత్తిని గోవర్ధన్ తోటపల్లి సాయి కోటి శ్రీకాంత్ బట్ట కొమరయ్య మునిగేలా సాంబ తడికల చంద్రశేఖర్ గట్టుపల్లి రాజు కారం రామారావు గట్టుపల్లీ రామయ్య మైపా వెంకటేశ్వర్లు తదితర యువజన నాయకులు పాల్గొన్నారు.

# ఐఈడి బాంబు పేలి పోలీస్ అధికారి మృతి



**చర్ల, జూన్ 09**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సలైట్లు అమర్చిన ప్రెజర్ ఐఈడి పేలుడులో ధైర్యవంతుడైన అధికారి కుంట అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) ఆకాష్‌రావు గిరిపుంజే అమరుడ య్యాడు. ఆయన సెర్చ్ ఆపరేషన్‌లో ఉండగా, డోంద్రా సమీపంలో జరిగిన పేలుడులో చిక్కుకున్నారు. పలువురు పోలీస్ సిబ్బందికి గాయాలయ్యాయి.

**చివరి వీడ్కోలుకు సిద్ధమవుతున్నారు**

అమరవీరులైన ఏఎస్పీ ఆకాశ్ రావు గిరిపుంజే మృతదేహాన్ని ప్రభుత్వ లాంఛనాలతో రాయ్‌పూర్‌కు తీసుకువచ్చారు. కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మరియు ఇతర సీనియర్ అధికారులు రాయ్‌పూర్ విమానాశ్రయంలో ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులు కూడా తడిసిన కళ్ళతో విమానాశ్రయానికి చేరుకున్నారు. మృతదేహాన్ని మేకారా ఆసుపత్రికి తరలించారు, అక్కడ పోస్ట్‌మార్టం తర్వాత అంత్యక్రియలకు సన్నాహాలు చేస్తున్నారు. జూన్ పది న ఉదయం తొమ్మిది గంటలకు మహాదేవ్ ఘాట్‌లో అమరవీరుడి అంత్యక్రియలు నిర్వహించబడతాయి.

**ఎస్పీ నివాళులు**

రాయ్‌పూర్ ఎస్ఎస్పి డాక్టర్ లాల్ ఉమేద్ సింగ్ అమరవీరుడి కుటుంబాన్ని కలుసుకుని సంతాపం తెలిపారు. “ఆకాష్ సర్వీసులో చేరినప్పుడు, నేను రాయ్‌పూర్‌లో ఎఎస్‌పిగా ఉన్నాను అని విధి పట్ల ఆయన అంకితభావం, అంకితభావం ఆదర్శప్రాయమైనవి. ఈ నష్టం ఆ కుటుంబానికి మాత్రమే కాదు, మొత్తం పోలీసు శాఖకే నష్టం” అని ఆయన అన్నారు

**ధైర్యవంతుడైన అధికారి సేవలు**

ఏఎస్పీ ఆకాష్ రావు గిరిపుంజే 2013 బ్యాచ్ రాష్ట్ర పోలీస్ సర్వీస్ అధికారి. ఆయన రాయ్‌పూర్ మరియు మహాసముంద్‌లో విధులు నిర్వర్తించారు. రాజధాని రాయ్‌పూర్‌లోని సివిల్ లైన్ పోలీస్ స్టేషన్ ప్రాంతానికి సి ఎస్ పీ గా కూడా పనిచేశారు. తన సర్వీసులో ఉన్నప్పుడు, ఆయన అనేక ప్రధాన నేర సంఘటనలను ఛేదించారు. రాయ్‌పూర్‌లోని హోలీ క్రాస్ స్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు.

**బస్తర్‌లో మూడో సంఘటన**

ఛత్తీస్‌గఢ్‌లో ఇది మూడవ సంఘటన బస్తర్‌లో అదనపు ఎస్పీ స్థాయి అధికారి అమరవీరులవడం ఇది రెండవది. గతంలో, భాస్కర్ దివాన్ 2001లో, రాజేష్ పవార్ 2011లో అమరవీరులయ్యారు. ఇప్పుడు 2025లో, ఏఎస్ పీ ఆకాష్ రావు గిరిపుంజే పేరు కూడా ఈ జాబితాలో చేర్చబడింది.

**ఐఈడి బాంబు ఘటన**

సోమవారం ఉదయం, ఏ ఎస్ పీ గిరిపుంజే, డి ఎస్ పీ కొంటా భానుప్రతాప్ చంద్రకర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి సోనాల్ గావ్లా తో కలిసి ఆ ప్రాంతంలో నక్సలైట్లు ఒక జె సి బి కి నిప్పుపెట్టారని తెలిసి దర్యాప్తు చేయడానికి గాలింపు చర్యకు దిగారు. కొంటా-ఎర్రబోరా రహదారిలోని డోంద్రా సమీపంలో ప్రెజర్ ఐ ఈ డి పేలుడు సంభవించింది, దీనిలో ఏ ఎస్ పీ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించారు, కానీ చికిత్స సమయంలో అతను మరణించాడు. గాయపడిన ఇతర అధికారులు శ్రీ భానుప్రతాప్ చంద్రకర్ (సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్, కొంటా) మరియు ఇన్‌స్పెక్టర్ శ్రీ సోనాల్ గవ్లా (స్టేషన్ ఇన్‌ఛార్జ్, కొంటా) ప్రస్తుతం ప్రమాదం నుండి బయటపడ్డారు మరియు మెరుగైన చికిత్స కోసం వారిని విమానంలో ఉన్నత వైద్య కేంద్రానికి తరలిస్తున్నారు.రాష్ట్ర హోంమంత్రి విజయ్ శర్మ కూడా అమరవీరులైన ఎస్పీ ఆకాశ్‌రావుకు నివాళులర్పించారు. అదనపు ఎస్పీ ఆకాశ్‌రావు గిరిపుంజే చాలా ధైర్యవంతుడైన అధికారి అని ఆయన అన్నారు. వివిధ ప్రదేశాలలో పనిచేస్తూ శౌర్య పురస్కారం అందుకున్నారు. ఆయన బలిదానం మనందరికీ తీరని లోటు. అన్వేషణ కొనసాగుతోంది. ఇది నక్సలైట్ల పిరికి చర్య, ఆపరేషన్ ఒక్క క్షణం కూడా ఆగదు. సైనికుల చేతుల్లో చాలా బలం ఉంది అని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో బంగారు భవిష్యత్తు

# కంప్యూటర్ ఆధారిత విద్యా బోధన

**విద్యా వాహిని ప్రచార రథంతో బడిబాట ఇంటింటా ప్రచారం : ఎంఈఓ పావని**



**చిగురుమామిడి, జూన్ 09**

తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని సంకల్పంతో గ్రామాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు బడీడు పిల్లలందరూ ప్రభుత్వ బడులలో చదువుకొనుటకు ఆయా గ్రామాలలోని పిల్లల తల్లిదండ్రులను చైతన్య పరుస్తూ ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సుందరగిరి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట గ్రామాలలో విద్యా వాహిని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పావని మాట్లాడుతూ తల్లిదండ్రులు తప్పకుండా బడిలో చేర్పించాలని సూచించారు ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సదుపాయాలను తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలలో కంప్యూటర్ ఆధారిత విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. అలాగే ఉచిత పుస్తకాలు రెండు జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. ఉచితంగా విద్యను ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు ఈ అవకాశాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అంగన్వాడి టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## హాస్టల్స్ లో దోమలమందు పిచికారి



**చర్ల, జూన్ 09**

సోమవారం చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల అన్ని హాస్టల్లో దోమల మందు (ఐ.ఆర్.ఎస్ 5%) స్ప్రే చేయించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని చర్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక దగ్గర ఉండి పరిశీలించడం జరిగినది. డాక్టర్ హారిక మాట్లాడుతూ వర్షాకాలం దోమలు అధికముగా వచ్చే ప్రమాదం ఉన్నది దోమలు మనలను కుట్ట కుండ జాగ్రత్తలు తీసుకోవాలి అని అన్నారు. విద్యార్థులు జ్వరం వచ్చినట్లయితే వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్లాలని అక్కడ మంచి వైద్యం అందుతుందని తెలియజేశారు. హాస్టల్ చుట్టూ ప్రక్కలా నీరు నిలవకుండా చూసుకోవాలని, పిచ్చి మొక్కలు చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ధర్మా రావు, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రామకృష్ణ,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తులసి, హెల్త్ అసిస్టెంట్ ధర్మా రావు,నరసింహారావు,స్వరూప ఆశా కార్యకర్తలు రంగమ్మ,కృష్ణవేణి,ఉషారాణి పాల్గొన్నారు.



## విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సమావేశం

**చర్ల, జూన్ 09**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ప్రఖండ కేంద్రం లోని చిన్న ఇంద్రకీలాద్రి ఆలయం ఆవరణలో సోమవారం విశ్వహిందూ పరిషత్ చర్ల ప్రఖండ సమావేశం ప్రఖండ కార్యదర్శి కిషోర్ కుమార్ గ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అథిదిగా పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ వోరుగంటి సురేష్ కుమార్ మాట్లాడుతూ చర్ల లో ప్రతినెలా విశ్వహిందూ పరిషత్ సమావేశం నిర్వహించేలా చూడాలనీ, హిందూ ధర్మ రక్షణ పట్ల ఆసక్తి ఉన్న వారు పెద్ద సంఖ్యలో విశ్వహిందూ పరిషత్ లో చేరి హిందూ ధర్మ రక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు, అనంతరం ప్రఖండ కార్యదర్శి కిషోర్ కుమార్ సూచనలతో జిల్లా కార్యదర్శి గంగాధరి సీత ప్రఖండ కమిటీలో నూతన బాధ్యతలు ప్రకటించడం జరిగింది, ఈ సమావేశంలో ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు గారు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ చర్ల ప్రఖండ నూతన కమిటీ

అధ్యక్షులు: మామిడి శ్యామ్ కుమార్

ఉపాధ్యక్షులు: ఇరసవడ్ల రాము

ఉపాధ్యక్షులు: మీసాల శ్రీను

కార్యదర్శి: శివరాజు కృష్ణ కిషోర్ కుమార్

సహ కార్యదర్శి: అలవాల మురళీ

సహ కార్యదర్శి: చెరుకూరి శ్రీకర్

బజరంగ్దళ్ సంయోజక్: ఇన్నమూరి సృజన్ కుమార్

బజరంగ్దళ్ సహ సంయోజక్: గాదంశెట్టి ప్రదీప్

మాతృశక్తి సంయోజిక: పాసికంటి శ్రీదేవి

మందిర అర్చక పురోహిత్ ప్రముఖ్:యలమందల భాను ప్రకాష్

సత్సంగ ప్రముఖ్: యలమందల వీర వెంకట శాంతి కిరణ్

న్యాయ సలహ ప్రముఖ్: పరిటాల సంతోష్

ప్రచార(మీడియా) ప్రముఖ్: బొబ్బిలిపాటి కిరణ్

ప్రచార(మీడియా) సహ ప్రముఖ్: మద్ది లక్ష్మి నరసింహ రెడ్డి

తదితర కార్యకర్తలను చర్ల ప్రఖండ నూతన కార్యవర్గ సభ్యులుగా ప్రకటించడం జరిగింది.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

**బడిబాటను సక్రమంగా నిర్వహించాలి.: మంత్రి సీతక్క**

భువనగిరి జూన్ 9 : రాష్ట్రంలో కోటి మం ది మహిళలను కోటీశ్వరులను చేయాలని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధిశాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడా రు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని మహిళా సంఘాలకు పెట్రో లు బంకులు కేటాయిస్తున్నామన్నారు. అందుకు అనువైన స్థలాలను గుర్తించాలని, ఒక బంక్ ఏర్పాటుతో 10 కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయన్నారు.

# ఖరీఫ్ సాగు సమస్యలు తీరేనా



హైద్రాబాద్ : 'వానాకాలం పంటల సాగుకు సన్నద్ధం కావాలని... అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేసే కంపెనీలు, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని...' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వ్యవసాయశాఖ అధికార్లతో ఇటీవలే సచివాలయంలో జరిపిన సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు. ...ఇప్పటికే అన్ని జిల్లాలకు సరిపడ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని... ఈ సీజన్‌లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్‌లో ఉన్నాయని, సీఎంకు అధికారులు వివరించారు. కానీ, ఆచరణలో ప్రతి సంవత్సరం జరుగుతున్నది మరో విధంగా ఉంటున్నది. ఈ సంవత్సరం కూడా దానికి భిన్నంగా ఉండబోదని భావించాల్సి వస్తున్నది. మొత్తం విత్తన అవసరాల్లో ప్రభుత్వ విత్తన సరఫరా 20శాతం మాత్రమే. అలాగే ఎరువుల కొరత కూడా ఉంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని సాధారణం కంటే ముందే తాకాయి. తెలంగాణలో కూడా రుతుపవనాలు వ్యాపించాయి. ఫలితంగా రాష్ట్రంలో తొలకరి జల్లులు పడుతున్నాయి. దీంతో రైతాంగానికి ఆశ కలుగుతోంది. గత ఏడాది అకాల వర్షాలు, నాసిరకం, కల్తీ విత్తనాలు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవటం వంటి సమస్యలన్నీ రైతులను నష్టపరిచాయి. దీంతో రైతు ఆత్మహత్యలు కొనసాగాయి. ఇది బాధాకరమైన విషయం. అయినా సాగునే నమ్ముకొన్న రైతాంగం బాధల్ని దిగమింగుకొని మళ్ళీ ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సిద్ధపడ్డారు. 'తమది రైతు ప్రభుత్వమ'ని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు అన్ని విధాలా తోడ్పడాలి. రాష్ట్రంలో ఈ సంవత్సరం కోటి 34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు ఖరీఫ్‌లో సాగు కానున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో వరి 66.80 లక్షల ఎకరాల్లో, పత్తి 50 లక్షల ఎకరాల్లో... అలాగే మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న, సోయాబీన్, మినుములు, కంది, ఇతర ఉద్యానవన పంటలు వేయనున్నారు. ఇందుకు వరి విత్తనాలు 16.70 లక్షల క్వింటాళు, 90 లక్షల పత్తి ప్యాకెట్లు, క్వింటాళ్ల కొద్దీ సోయాచిక్కుడు విత్తనాలు అవసరం అవుతాయి. అయితే విత్తనాలు అందుబాటులో ఉంచామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, విత్తనాల లోటును ఆసరా చేసుకొన్న వ్యాపారులు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. ప్రభుత్వం కఠిన చర్యల పేరుతో విత్తన కంపెనీలపై కాకుండా, అమ్మేవారిలో కొందరిపై చర్యలు చేపట్టి, చేతులు దులుపుకుంటున్నది. ఇది నకిలీ విత్తన సమస్యకు పరిష్కారం కాదు. ఈ సందర్భంగా జన్యు శాస్త్రవేత్త సుమన్ సహాయ్ చెప్పిన మాటలు గమనార్హం. "విత్తనాలపై ప్రైవేట్, కార్పొరేట్ బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం భారత్‌లో వ్యవసాయ రంగానికి పెనుముప్పుగా మారింది. అన్నదాతలకు నష్టాలను మిగల్చటంతో పాటు నేల సాంద్రత దెబ్బతినటంతో సహా అనేక దుష్పరిణామాలకు కారణమవుతోంది. హరిత విప్లవ సమయంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో విత్తనాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేశారు. మొదట్లో అవి విత్తనాలను ఉత్పత్తి చేయించి రైతులకు పంపిణీ చేయించేవి. క్రమేపీ వాటిని నిర్వీర్యం చేశారు. ఇప్పుడు కార్పొరేట్, బహుళజాతి సంస్థల రాజ్యం నడుస్తోంది." "సాగు విస్తీర్ణం లక్ష్యాలను ప్రైవేట్ రంగం తమకు అనుకూలంగా మార్చుకొంటోంది. రైతులను మోసం చేస్తోంది. కొనుగోలు చేసే రైతులకు రశీదులు ఇవ్వడం లేదు. విత్తన నాణ్యతను ముందుగా గుర్తించే వ్యవస్థ లేదు. పంటలు వేసి నష్టపోయిన తరువాతే లోపాలు బయటపడుతున్నాయి. మోసపూరిత సంస్థలపై చర్యల్లేవు. రైతులకు నష్టపరిహారం కూడా ఇచ్చే పరిస్థితి లేదు." ఈ పరిస్థితులన్నీ మారాలి. వాస్తవానికి ఖరీఫ్ సాగుకు విత్తనాలు, ఎరువులతో పాటు, రుణాలు, వ్యవసాయ పరికరాలు, పురుగు మందులూ అవసరమే. అవి కౌలు రైతులతో సహా పేద, మధ్యతరగతి రైతాంగానికి సగం సబ్సిడీతో సకాలంలో ప్రభుత్వమే అందించాలి. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సరఫరా చేయాలి. అన్ని పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర చట్టబద్ధంగా కల్పించి అమలు చేయాలి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులు తగిన ప్రణాళికలు రూపొందించి కృషి చేయాలి. అప్పుడే ఖరీఫ్ సాగుతో సంతృప్తికరమైన ఫలితాలు వస్తాయి.

# యుద్ధలాభం ఆయుధ వ్యాపారులకే



పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత సంభవించిన పరిణామాలు విస్తృత చర్చకు దారితీశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకోడమే తమ ధ్యేయమన్న బీజేపీ నాయకుల సారథ్యంలో భారత్ వెనక్కి తగ్గిందనే ప్రచారం సాగింది. దీనిని తుడిచిపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటుతూ దేశమంతా ఊరేగింపులు జరిగాయి. వాస్తవంలో పూర్తిస్థాయి యుద్ధం దరిదాపులకు వెళ్లిన భారత, పాకిస్థాన్‌లు ఉన్నపళంగా ఘర్షణలను విరమించుకున్నాయి. ఇది సిమ్లా ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య చర్చల ద్వారానే జరిగిందని తాజాగా ప్రకటించుకున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతోనే యుద్ధం ఆగిందన్న సమాచారం మెరుపు వేగంతో వ్యాపించింది. అప్పుడు దానిని రెండు దేశాల పాలకులూ తక్షణమే ఖండించలేదు. యుద్ధమే జరిగితే సంభవించబోయే ఘోర పరిణామాల గురించి వివరించనక్కరలేదు. అటువంటి భయానక స్థితిని తొలగించినందుకు, భారత పాకిస్థాన్ పాలకులను ఇందుకు ఒప్పించినందుకు అమెరికా అధ్యక్షుడిని అభినందించడంలో తప్పు లేదు. అయితే ఇంతటితో యుద్ధ భాష ఆగకపోడమే ఆందోళనకరం. పరస్పరం పిప్పి, పిండి చేసుకోవాలన్న 'మీసాల' మెలివేత కొనసాగుతూనే ఉంది. ఇది రెండు దేశాల పాలకులు తమ ప్రజల్లో పొరుగు దేశం పట్ల ద్వేషాన్ని మరింతగా పెంచి రాజకీయంగా లాభపడడానికి పాటిస్తున్న వ్యూహమే. దీనివల్లనే శాశ్వత చర్చలకు ఆటంకం కలుగుతున్నది. ఇక్కడే మరొక బాధాకర పరిణామం%-%1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరాగాంధీతో మోదీని పోల్చుతున్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ల మధ్య తలెత్తిన ఆ యుద్ధం వల్ల లక్షలాదిమంది తూర్పు పాకిస్థానీయులు మన దేశంలోకి పారిపోయి రాడంతో ఇందిరాగాంధీ భారత దళాలతో ముక్తిబాహినిని సృష్టించి బంగ్లాదేశ్ అవతరణకు తోడ్పడ్డారు. అయితే ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించ లేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఇది తమ ఓటు బలాన్ని తగ్గిస్తుందని, చేరువలో ఉన్న బిహార్ ఎన్నికల్లో దెబ్బ తింటామని బీజేపీ భయపడుతున్నది. అంతేగాని పూర్తి స్థాయి యుద్ధానికి వెళ్లకుండా నిగ్రహం పాటించినందుకు సంతోషించడం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మోదీ పాకిస్థాన్ పీచమణిచారన్న అభిప్రాయాన్నీ బలంగా నాటుతున్నారు. పాకిస్థాన్‌ను మోకాళ్ళ మీదకు తెచ్చామని ఆయన కూడా ప్రకటించారు. ఈ అవకాశం, ఈ స్వేచ్ఛ తమకు ఇచ్చినందుకు భారత దళాలు ప్రధాని మోదీకి మొక్కుతున్నాయి అనేవారూ బయలుదేరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంతవరకూ జరిగిన నాలుగు యుద్ధాల్లో అసంఖ్యాకంగా సైనికులు మరణించారు. ఆయుధాలకోసం రెండు దేశాలు విశేషంగా డబ్బు తగలబెట్టాయి. భారత ఉపఖండంలో రాజకీయం ఇప్పటికీ మతోన్మాదం ప్రాతిపదికనే కొనసాగుతున్న మాట కాదనలేని సత్యం. కశ్మీర్ పరిణామాలకూ అదే ఇంధనమవుతున్నది. హిందూత్వ రాజకీయాల మత కోణం దేశ ప్రజల మధ్య సృష్టిస్తున్న విభజన గురించి వివరించనక్కరలేదు. మతపరంగానో, సరిహద్దు వివాదం పరంగానో యుద్ధం తలెత్తితే అవతలి దేశాన్ని చీల్చి చెండాడాలని, దాన్ని నామరూపాలు లేకుండా చేసేయాలని పళ్ళు పటపటా కొరకడాన్ని అటూ ఇటూ గల ప్రజలకు అలవాటు చేశారు. భారత సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే యుద్ధాన్ని గురించి కొద్ది రోజుల క్రితమే మంచి మాటలు చెప్పారు. యుద్ధాలు బాలీవుడ్ సినిమాలు కావన్నారు, యుద్ధాల్లో ఎంతమంది చనిపోతారో, మరెంతమంది వికలాంగులై జీవితాంతం ఎడతెగని వ్యథను అనుభవిస్తారో గుర్తు చేశారు. కురుక్షేత్రం లాంటి యుద్ధ గాథలు సినిమాల్లో, నాటకాల్లో చూడ్డానికే బాగుంటాయి. ఒకరినొకరు నరుక్కోడం, శత్రువు రొమ్ము చీల్చి రుధిరమ్ము తాగడం వాస్తవంలో ఎంతమాత్రం కోరదగినవి కావు. ఇప్పుడు సరిహద్దుల రక్షణలో కన్నార్పకుండా కాపలా కాస్తున్నవారిలో, యుద్ధాల్లో ప్రాణాలు విడుస్తున్నవారిలో అత్యధికులు పేద బహుజనులే. ఉపాధి కరువై పొట్ట కూటి కోసం సైన్యంలో చేరుతున్నవారే ఎక్కువమంది. పహల్గాం ఉగ్ర దాడి బహు హేయమైనది. ఈ ఉన్మాదులు భారత, పాకిస్థాన్‌లు చేరువ కాకుండా అన్ని తంత్రాలను ప్రయోగిస్తున్నారు. రెండు దేశాల మధ్య మతపరమైన దూరాన్ని పెంచి దాన్ని అధిగమించడానికి వీలు లేని స్థాయికి తీసుకువెడుతున్నారు. భారత వ్యతిరేక ఉగ్రశక్తులకు పాకిస్థాన్ సైన్యం అండదండలు లభిస్తున్నాయి. అది పాక్ ప్రేరిత ఉగ్రవాదమే. అయితే ఈ విషయాన్ని మనం నమ్ముతున్నంతగా మిగతా ప్రపంచం నమ్మడం లేదు. మిగతా దేశాలు భారత్, పాకిస్థాన్లను ఒకేలా చూస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పాలకులు తెలుసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌ను భారత్ గట్టి దెబ్బే తీసింది. అంతటితో ఆగకుండా పాకిస్థాన్ నిజస్వరూపాన్ని తెలియజేయడానికి దేశ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించడం బాగుంది. అయితే అది కూడా రాజకీయ విభేదాలకు దారి తీయడం బాధాకరం. పాకిస్థాన్‌పై బలంగా విరుచుకుపడ్డాం గాని పహల్గాం దాడి ముష్కరులను కనుక్కోడంలో జాప్యం జరుగుతున్నది. వారెవరో స్పష్టంగా తెలిస్తే బాగుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో వూగిపోడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది. వాస్తవానికి టెర్రరిజం సమస్య చాలా లోతైనది. ప్రపంచ పాలకులు ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్ వంటి దేశాలు చిత్తశుద్ధితో ఆలోచిస్తే వాటి అసలైన మూలాలు కనిపిస్తాయి. భారత పాకిస్థాన్‌లకూ ఇదే వర్తిస్తుంది. టెర్రరిజం గాని, వామపక్ష ఉగ్రవాదం గాని ఊరకే ఆకాశం నుంచి ఊడిపడేవి కావు. మెజారిటీ, మైనారిటీలు హాయిగా శాంతియుత సహజీవనం చేస్తున్న చోట సెక్యులరిజం వర్ధిల్లుతున్న దేశంలో మతపరమైన మెజారిటీని మైనారిటీల మీదికి రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యమనిపించుకోదు. పాక్‌కు జీలం నది నీటిని ఆపడం గాని, ఘర్షణలకు కారణమయ్యారని భావించి వారి ఇళ్లు కూల్చి తల మీద కప్పు లేకుండా చేయడం గాని మానవీయమైన పనులు కావు. కక్ష కక్షనే ఇస్తుంది. ఉగ్రవాదానికి అది కూడా దారి తీస్తుంది. మన దేశంలో అధిక సంఖ్యాకుల మతస్వామ్యం వంటిదే రాజ్యమేలుతున్నది. వక్ఫ్ బిల్లులో మోదీ ప్రభుత్వం తేదలిచిన మార్పులను సెక్యులర్ రాజ్యాంగ రక్షకురాలైన సుప్రీంకోర్టు తీవ్రంగా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం. ఉగ్రవాదం క్రూరమృగం కంటే ప్రమాదకరమైనది. దాని నిజమైన మూలాలు తెలుసుకొని వాటిని నిర్మూలించినంతవరకూ పేట్రేగుతూనే ఉంటుంది.

# ప్రభుత్వోద్యోగులు జవాబుదారీగా ఉండాలి



పబ్లిక్ సర్వెంట్లు అధికార దుర్వినియోగం, చట్టాలు నిర్వీర్యం చేయకుండా నిరోధించడానికి ఆటంకం కలిగిస్తున్న 'సద్దుద్దేశ్య చర్యలకు రక్షణ' పేరుతో అవినీతి నిరోధక చట్టం, నేర విచారణ చట్టం తదితర చట్టాలలో ఉన్న నిబంధనలను రద్దు చేయాల్సిన అవసరం ఉంది. పాత-కొత్త భూ సమస్యలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం నిత్యం బాధితులు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను ఆశ్రయిస్తున్నారు. వీరు ఆ అర్జీలను సంబంధిత అధికారులకు తగు చర్యల నిమిత్తం పంపిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన సమస్యల కోసం కొద్ది సంఖ్యలో ప్రజలు వీరి వద్దకు రావాలి. దానికి విరుద్ధంగా చిన్న సమస్యల నుంచి పరువు-మర్యాదలు, జీవన్మరణ సమస్యల దాకా వీరి వద్దకు వచ్చి మొరపెట్టుకుం టున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి చిన్న పనికీ రాజకీయ జోక్యం, పని భారం, వ్యక్తిగత ప్రయోజనాలు ప్రభావం చూపిస్తున్నాయి. వాస్తవానికి పబ్లిక్ సర్వెంట్లలో అధిక శాతం సేవాభావంతోనే విధులు నిర్వహిస్తున్నారు. కాని దారితప్పిన కొంతమందితో ప్రభుత్వ సేవకుల పరువుప్రతిష్ఠలు దిగజారుతు న్నాయి. పబ్లిక్ సర్వెంట్లు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ తమ సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కరించడం లేదని ప్రజలు వాపోతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉద్యోగులు ప్రజల్ని వేధిస్తున్నారు. పబ్లిక్ సర్వెంట్లకి 'రక్షణ' పేరుతో ఉన్న నిబంధనలు వారికి కవచాలుగా ఉన్నాయి. ఒక ఉద్యోగి నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో తన విధి నిర్వహిస్తే అందుకు తగిన ఆధారాలు ఉంటాయి. చేయని నేరాలను అంటకట్టి తప్పుడు కేసులు పెట్టే బాపతు సామాన్య ప్రజానీకంలో నూటికి ఒక్కరు ఉంటారు. ఆ సందర్భంలో అన్ని రుజువులు పబ్లిక్ సర్వెంట్లకు అందుబాటులో ఉంటాయి. కాబట్టి నిరూపించుకుని, బయటపడడం సులువు. ప్రభుత్వోద్యోగి అధికార దుర్వినియోగాన్ని లేదా చట్టం నిర్వీర్యం చేయడాన్ని నిరూపించాలంటే సామాన్య ప్రజానీకానికి చాలా కష్టమైన పని. అందువల్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు తమ వద్దకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారం చేయడంతో పాటు అసలు తమ వద్దకు సమస్య వచ్చేదాకా పరిష్కారం చేయకపోవడానికి కారణాలు ఏమిటో అధికారుల నుంచి సంజాయిషీ కోరాలి. అందులో నిర్లక్ష్యం లేదా కారణాలు సరిగా లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమిస్తే, భవిష్యత్తులో ఈ తప్పిదాలు పునరావృతం కావు.

## పాకిస్థాన్‌ను ముంచిన
# మతమౌఢ్యం

మతాన్ని కేంద్రంగా చేసుకుని పరిపాలిస్తే ఒక దేశం ఏ విధంగా వెనుకబడిపోతుందనేది పాకిస్థాన్‌ను పరిశీలిస్తే అవగతమవుతుంది. మత ప్రాతిపదికన ఏర్పడిన దేశమది. తొలి నుంచీ అనుసరించిన మత ప్రేరిత విధానాల వల్ల పాకిస్థాన్ అన్ని రంగాలలో వెనుకబడి పోయింది. ఇటీవల ఖతర్ పర్యటన నుంచి స్వదేశానికి తిరిగి వెళ్ళిన పాకిస్థాన్ ప్రధాని షహేబాజ్ షరీఫ్ 'తాము 75 ఏళ్ళుగా బిక్షాటన చేస్తున్నట్లు' వాపోయారు! 1947లో స్వతంత్ర దేశంగా ఆవిర్భవించినప్పుడు పాకిస్థాన్‌కు వ్యవసాయమే ప్రధాన ఆదాయవనరు. పాకిస్థాన్ భౌగోళికంగా భారత్ కంటే చిన్న దేశమే అయినప్పటికీ సమృద్ధ జలవనరులు, సారవంతమైన సాగు భూములకు నెలవైన పంజాబ్ కారణాన పాక్ ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉండేవి. అవిభక్త భారత్ విభజన నాటికి ఉన్న 921 ప్రధాన పరిశ్రమలలో కేవలం 34 మాత్రమే పాక్‌కు దక్కాయి. అవి కూడా ప్రధానంగా బెంగాల్‌లోని జనపనార పరిశ్రమలు మాత్రమే. 1950లో పాకిస్థాన్ తలసరి ఆదాయం 1268 డాలర్లు. ఇది అప్పట్లో భారత్ తలసరి ఆదాయం కంటే దాదాపు రెండు రెట్లు అధికం. అయితే కశ్మీర్‌ను స్వాయత్తం చేసుకోవడమే పాక్ జాతీయ రాజకీయాల ప్రధాన లక్ష్యమయింది. ఆ లక్ష్య సాధనకై భారత్‌కు వ్యతిరేకంగా యుద్ధాలకు తెగబడింది. ఈ యుద్ధాలు, రాజకీయాల వల్ల పౌర, సైనిక పాలకులు పలు విధాల ప్రయోజనాలు పొందారు. అయితే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యారు. దేశాన్ని అత్యధిక కాలం ఏలిన సైనికాధికారులు ఇస్లామిక్ భావజాలంతో కశ్మీర్‌ను బూచిగా చూపి పంజాబీలు, సింధీలు, బలూచీలు, పఠాన్లు, మహాజీర్లుగా విడిపోయిన దేశాన్ని ఒక్కటిగా నిలబెట్టారు. అయితే దానితో పాటు దేశ బడ్జెట్ కేటాయింపుల్లో సింహభాగాన్ని రక్షణ శాఖకు దక్కించుకోవడంలో సఫలీకృతులయ్యారు. సోవియట్ యూనియన్, అమెరికా మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో పొరుగున ఉన్న అఫ్ఘానిస్థాన్ ఒక పావుగా మారింది. పాక్ సైన్యంలో స్వతహాగా అత్యధికులుగా ఉన్న పఠాన్ల అంశం, అఫ్ఘాన్ లోని పరిణామాలు సహజంగా ఇస్లామాబాద్‌కు అంతర్జాతీయంగా ఒక సముచిత పాత్రను కల్పించాయి. సోవియట్ ఎర్రసేనలను దెబ్బతీయడానికి అమెరికా జిహాద్‌ను ప్రోత్సహించి పాకిస్థాన్‌కు అన్ని రకాలుగా అండగా నిలిచింది. జనరల్ జియా ఉల్ హఖ్ హయాంలో ఈ జిహాద్ ఉగ్రవాదం పరాకాష్ఠకు చేరుకుంది. అమెరికా మద్దతుతో ఇస్లామాబాద్ పాలకులు ఆడింది ఆట పాడింది పాట అయింది. ఇదే సమయంలో పాక్ పాలకులు తాము అనుసరిస్తున్న మత ప్రేరిత భావజాలానికే మరింతగా నిబద్ధమయ్యారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత జిహాద్ నుంచి అమెరికా వైదొలిగినా ఆ భావజాలం మాత్రం అదే విధంగా పాక్ రాజకీయాలు, సమాజంలోనూ దృఢంగా ఉండిపోయింది.

# ట్రంప్ సుంకాల ప్రభావంపై ఆలోచించాలి

**దేశీయంగా సన్నద్ధతను సంతరించాలి**

**మేధావులు,రాజకీయ, ఆర్థికవేత్తలతో చర్చించాలి**

**న్యూఢిల్లీ :** ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక మన పరిస్థితి ఎలా ఉందో బేరీజు వేసుకునే సమయం వచ్చింది. నిరుద్యోగ భారతాన్ని ఇంకెంతో కాలం నెట్టుకు రావడం సాధ్యం కాదని మోడీ గుర్తించాలి. ఈ క్రమంలో అమెరికా ప్రభావంపై దేశీయంగా చర్చించాలి. మేధావులు, ఆర్థికవేత్తలు, విదేశీ నిపుణలతో పాటు రాజకీయనేతలో వరుసగా చర్చలు చేయాలి. ఇందులో సిగ్గుపడాల్సిన పనిలేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం కూడా సరికాదు. పదేళ్ల పదవీ కాలంలో నిరుద్యోగులను అగాధంలోకి నెట్టిన మోడీ బృందానికి సహజంగానే విమర్శలను జీర్ణించుకునే స్థాయి లేదు. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా.. గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు.సత్యాలను కూడా అంగీకరించలేని స్థితికి ఆ పార్టీ చేరింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పాలన సాగిస్తున్న తీరు సరికాదు. చంద్రబాబు లాంటి వారు ఇప్పటికైనా స్పందించాలి. మోడీ విధానాలకు తందానా అనకుండా అంతర్గగత చర్చలకు పట్టుబట్టాలి. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోవడం మానుకోవాలి. ఆర్థిక ఉపద్రవం ముంచుకు వస్తున్న వేళ జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. దేశంలో నిరుద్యోగం 46 ఏళ్ల గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడం తప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. జిఎస్టీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ప్రస్తుత విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోవడం లేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. వ్యవసాయానుబంధ పరిశ్రమలు పెట్టి నిరుద్యోగాన్ని రూపుమాపకుండా ఉపన్యాసాలతో కాలం వెళ్ల దీసారు. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టిన మోదీ వైఫల్యాన్ని కాలంగడుపుతున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. నల్లధనాన్ని తవ్వితీయ డమనే ప్రకటిత లక్ష్యాన్ని సాధించకపోగా, నలుపును తెల్లగా మార్చి, చక్కగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. దీనిని గుర్తించి పన్నులను హేతుబద్ధీ కరించాలి. పోపుల డబ్బాలో కూడబెట్టుకున్న దానికి సైతం జిఎస్టీ కట్టే దరిద్రం దాపురించింది. అధికారం లోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. ఆర్థిక వ్యవస్థ నాశనం చేసి ఇప్పుడు ఆత్మనిర్భర భారత్ జపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత 45 ఏళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి దాపురించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా అది అసమతుల్యంగా ఉండడం వల్ల తగినన్ని ఉద్యోగాల సృష్టి జరగక లక్షలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఎప్పుడూ లేనంత నిరుద్యోగం ఇప్పుడు ఉన్నదనీ, కోట్లాది ఉద్యోగాలు సృష్టిస్తామన్న మోదీ హామీ అమలు కాలేదు. ఈ క్రమంలో అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో విస్తృత చర్చ జరగాల్సి ఉంది.

## తిరుమలలో విఐపిలకే ప్రాధాన్యం

**సామాన్యులకు దక్కని దర్శనభాగ్యం**

**తిరుమల :** తిరుమలలో వేసవి రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లో నిండి బయటకు క్యూలు కడుతున్నారు. ఏటా ఇదే తంతు సాగుతోంది. విఐపిలు పదేపదే రావడంతో వారికోసం దర్శనాలను నిలిపివేస్తున్నారు. వారి రాకను నియంత్రిస్తామన్న హామీ నెరవేరడం లేదు.తిరుమల శ్రీవారిని సామాన్యులు మాత్రమే దర్శించుకునేలా ఆంక్షలు విధించాలని భక్తులుకోరుతున్నారు. రద్దీ ఉన్న సమయాల్లోనూ విఐపిలు రావడం వల్ల తీవ్రిబ్బందులు కలుగుతున్నాయని, సామాన్యులకు దర్శనం కలగడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భక్తులు తమ ఆపదల మొక్కులు తీర్చుకోవడానికి వస్తారని అలాంటి సమయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అయినా దేవుడికి భక్తుడికి మధ్య అధికారుల పెత్తనం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుమలలో ముందు భక్తులకు సత్వర దర్శనం కలిగేలా విఐపిలను నియంత్రించాలని అన్నారు. ఆ నిబంధనేదో ముందు ప్రజాప్రతినిధులకు విధించాలని అంటున్నారు. తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం. కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు. ప్రశాంతతకు మారుపేరు తిరుమల.. అయితే పెత్తనం చెలాయించాలను కోవడం సరికాదు. ఇకపోతే ఇటీవల ఇక్కడ అన్యమత ప్రచారాలు, మద్యం, మాంసం తదితర విషయాల్లో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గవర్నర్ వ్యవస్థ రద్దు కోసం పోరాడాలి !

**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు ఇటీవల అనేక చారిత్రక తీర్పులను వెలువరిస్తోంది. అనేక విషయాల్లో మార్గనిరద్దేశనం చేస్తోంది. ఇవన్నీ కూడా పాలకులకు కనువిప్పు కావాలి. రాజకీయ నాయకులపై కేసులు కావచ్చు..వారి ఆస్తులు కావచ్చు..గవర్నర్ వ్యవస్థ కావచ్చు..ఇలా అనేక త చారిత్రక తీర్పులు వస్తున్నాయి. ఇకపోతే గవర్నర్ వ్యవస్థ ఆరోవేలు లాంటిది. దానితో ఆడుకోవడం రాజకీయ నాయకులకు అవసరం. అందుకే గవర్నర్ వ్యవస్థను ఎత్తేయలేకపోతున్నారు. దేశంలో ఈ వ్యవస్థ వల్ల ఏటా వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. రాజకీయ పాచికలు ఆడేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఉపయోగించు కుంటోంది తప్ప ప్రజలకు నేరుగా ఉపయోగం లేదు. అంతేకుండా రాష్ట్రాల్లో అనవసర అధికార కేంద్రంగా మారింది. దీనిని ఎత్తేయాలని ఎన్టీఆర్ సహా అందరూ డిమాండ్ చేసినవారే. కానీ వినేదెవ్వరు... వినిపించే దెవ్వరు అన్న చందంగా ఇప్పుడు పరిస్థితి తయారయ్యింది. గవర్నర్ పోస్టు లేకుండా ప్రభుత్వం నడుస్తుంది. కానీ దీనివల్ల ఉపయోగం లేదని తెలిసినా కొనసాగిస్తున్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఉపయోగిస్తున్నారు. అధికారంలో కాంగ్రెస్, ఉన్నా, ఇప్పుడు బిజెపి ఉన్నా ఒరిగిందేమీ లేదు. అందుకే దివంగత ఎన్టీఆర్ దీని రద్దు కోసం ఆనాడు గట్టిగానే డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు కూడా ఇవే డిమాండ్ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్, బిజెపిలు మాత్రం రోరు మెదపడం లేదు. ఇటీవల తమిళనాడు వ్యవహారం తీసుకుంటే ఎంత రచ్చయ్యిందో చూశాం. గతంలో బెంగాల్లోనూ, కేరలలోనూ ఇదే తరహా రాజకీయాలు నడిపారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న తమిళసై సైతం ఇదే తరహాలో వ్యవహరించింది.కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ తాబేదార్లు గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ల వైఖరిని వ్యతిరేకిస్తూ కేరళ ప్రభుత్వం న్యాయపోరాటం చేస్తోంది. కేరళ ప్రభుత్వం లేవనెత్తిన అంశాల ప్రాధాన్యతను, ఔచిత్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్పింది. కేరళ మాజీ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పలు బిల్లులను నిలిపివేసిన సంగతి తెలిసిందే. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి. ఇటీవల సుప్రీంతో చివాట్లు తిన్నారు. అంతేగాకుండా ఆయన ప్రమేయం లేకుండానే బిల్లులను పాస్ చేస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అనేక చారిత్రాత్మక తీర్పులను వెలువరిస్తున్న సుప్రీంకోర్టు...మరో చారిత్రాత్మక తీర్పుతో తమిళనాడు గవర్నర్ చెంపచెల్లుమనిపించింది. గవర్నర్ల మితిమీరిన నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు...బిజెపి కాంగ్రెస్‌లకు కనువిప్పుకావాలి. కాంగ్రెస్ కాలం నుంచే గవర్నర్ వ్యవస్థను రాజకీయపునరావాస కేంద్రాలుగా మార్చుకుంది. బిజెపి కూడా దానిని కొనసాగించింది. తమిళనాడు గవర్నర్ రవి అనుసరించిన తీరుపై సుప్రీం తీర్పు రాజ్యాంగ వ్యవస్థను బలోపేతం చేసేదిగా ఈ తీర్పు... సహజంగానే డిఎంకె ప్రభుత్వానికి భారీ విజయంగా చూడాలి.. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఫెడరలిజం బలోపేతానికి జరుగుతున్న పోరాటానికొక ఊతం. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకో రక్షణ కవచం. ఈ తీర్పు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితమైనది కాదు. మొత్తం భారతదేశంలోని రాష్ట్రాలన్నింటికీ సంబంధించినది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు సూటిగా ఉంది. ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు. అంతేకాదు గవర్నర్లు ఎంతో ఉండాలో నిర్దేశించింది. నెలలోగా బిల్లులను ఆమోదించాలని చెప్పింది. లేకుంటే అవి బిల్లులగా మారుతాయని తేల్చింది. ఈ తీర్పు ఎలాంటి అనుమానాలు లేకుండా చాలా స్పష్టంగా వుంది. గవర్నర్లంటే... కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేసే దుస్సంప్రదాయానికి ఈ తీర్పు చెల్లుచీటీ రాసింది. బిజెపి ఎక్కడా ఈ తీర్పుపై మాట్లాడ లేదు. రాజ్యాంగానికి దెబ్బపడకుండా చూస్తామని చెప్పలేదు. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలగవలసిన వ్యక్తి కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తాజాగా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా తనవద్దే తొక్కిపెట్టిన గవర్నర్ వైఖరిని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. 'కీలకమైన 10 బిల్లులను ఆమోదించకుండా తన వద్దనే తొక్కిపెట్టి , ఆయన తీసుకున్న నిర్ణయం, వ్యవహరించిన తీరు చట్టవిరుద్ధం, ఏకపక్షం' అని అభివర్ణించింది. తమిళనాడు గవర్నర్ రవి తన నియామకం జరిగిన నాటినుంచీ ఇలాగే వ్యయహరించారు. ఒకసారి శాసనసభ బిల్లులను ఆమోదించిన తర్వాత వాటిపై నిర్ణయం తీసుకోవడానికి న్యాయస్థానం కాలపరిమితిని కూడా నిర్దేశిరచింది. ఈ బిల్లులకు సంబంధించి గవర్నర్ తీసుకున్న చర్యలన్నీ రద్దవుతా యని, అసెంబ్లీ... గవర్నర్‌కు తిరిగి పంపిన తేదీ నుంచి ఈ బిల్లులన్నీ ఆమోదం పొందినట్లు- పరిగణించాలని సుప్రీం స్పష్టం చేసింది. అంతేకాదు, గవర్నర్ రవి చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కోర్టు తప్పుబట్టింది. ప్రజలచే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల సలహా మేరకు గవర్నర్ వ్యవహరించాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం వీరికి ఇవ్వలేదని కోర్టు పునరుద్ఘాటించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావసరాలు, సంక్షేమం కోసం చట్టాలను రూపొందిస్తాయి. వాటిని నిరోధించే వైఖరి రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుపడటం గవర్నర్ పని కాదని ఎత్తిచూపుతూ...గవర్నర్ రవి అడ్డుకున్న పది బిల్లులను సుప్రీం ఆమోదించింది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సమర్థించే ఈ తీర్పు...అసెంబ్లీ హక్కులను హరించే గవర్నర్ల వైఖరికి ఒక హెచ్చరిక. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలకు చెంపపెట్టు లాంటిదని కడా చెప్పకతప్పదు. అంబేద్కర్ యంతికి ముందు వచ్చిన ఈ తీర్పు రాజ్యాంగాన్ని కాలరాస్తున్న వారికి కనువిప్పుకావాలి. ఈ సందర్భంగా ఉటంకించిన సుప్రీంకోర్టు పాలకులకు గట్టిగానే చురకలు వేసింది. ఈ క్రమంలో వచ్చిన ఈ తీర్పుతో...అస్పష్టతకు తెరపడింది. బిల్లులపై సంతకం చేయడానికి రాజ్యాంగం నిర్దిష్ట సమయాన్ని పేర్కొనలేదని చేసే వాదనలకు సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. ఈ తీర్పుతో అయినా గవర్నర్ వ్యవస్థ పనిలేదని గుర్తించాలి. దీనిని రద్దు చేసేందుకు అంతా ఉద్యమించాలి.

# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి !



**న్యూఢిల్లీ :** అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహతంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శతృవులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్త్‌లను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. వారికి కనీస రక్షణా లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో దేశీయంగా ఉపాధి రంగాన్ని పరుగులు పెట్టించాలి. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందించే స్థాయికి వైద్యరంగం బలపడాలి. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచు తామని బిజెపి చేసిన హామీలు అమలు చేసుకోవడానికిదే సరైన తరుణం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాలను సరళీకరించాలి. ఈ క్రమంలో వ్యవసాయ ఎగుమతులు పెంచుకోవాలి. మనవద్ద పండుతున్న మిర్చి, పత్తి, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ప్రపంచ దేశాలకు విరివిగా ఎగుమతి చేయడం ద్వారా ఆదాయాలను సమకూర్చు కోవాలి. ఇటీవల ఆక్వా ఎగగుమతులపై ట్రంప్ ప్రభావం పడింది. దానిపై దృష్టి సారించాలి. చైనా లాగా మానవవనరులను ఉపయోగించి వస్తూత్పత్తిని పెంచుకోవాలి. ప్రపంచ దేశాలపై ఆధారపడే విధానం పోవాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలోపతేం కాగలదు. నిరుద్యోగం సమిసి పోగలదు. చైనా తరహాలో కఠినంగా సాగితేనే ఇది సాధ్యమని గుర్తించాలి.

# అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం


## శ్రామికులను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం.అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయి ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 2014లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

# అప్పులతో ఎంతకాలమీ పాలన !

**న్యూఢిల్లీ :** ఉచిత పథకాలతో ఆర్థిక పరిస్థితి ఎలా దెబ్బతిందో చూస్తున్న మనం..ఇంకా అలాంటి వాటి కోసం కక్కుర్తి పడుతున్న రాజకీయనేతల కారణంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఇకపోతే ప్రతిదానికి కేంద్రాన్ని దేబురించే పరిస్థితి పోవాలి. ఆదాయం ఉన్నమేరకు ప్రణాళికలు ఉండాలి. అప్పులు చేసి, ఉచిత పథకాలను కొనసాగించే దౌర్భాగ్యం సరికాదు. సొంతంగా రాష్ట్రాలను అభివృద్ధి చేసి, ఆదాయాలను సంపాదించి పెట్టేలా చేయాలి. ఉమ్మడి ఎపి నుంచి విడివడ్డ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పుడు ఆర్థికంగా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసినా ప్రజల సమస్యలు తీరలేదు. అయినా పాలకుల్లో మార్పు కానరావడం లేదు. ఉచిత పథకాలు వద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. కిలో రూపాయికే సన్నబియ్యం గురించి తెలంగాణ కాంగ్రెస్ పాలకులు గొప్పలు చెబుతున్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం నాటి సిఎం ఎన్టీఆర్ ప్రవేశ కిలో రెండురూపాయల బియ్యం పథకాన్ని ఓటుబ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నారు. దీంట్లో జరుగుతున్న దుబారా పట్టించుకోవడం లేదు. అభివృద్ధిచేయడం ద్వారా సంపద సృష్టించి ప్రజలను స్వయం సమృద్ధిగా బతికేలా చేయాల్సిన నేతలు ప్రభుత్వ ఖాజానాను కొల్లగొట్టి దోచిపెడుతున్నారు. డబ్బుల పందేరం వల్ల అభివృద్ధి ఆగిపోయి..రాష్ట్రం దివాళా తీస్తున్నా పట్టించుకోని నేతల కారణంగా అన్ని రంగాల్లో వైఫల్యాలను చూస్తున్నాం. ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలవాల్సిన నేతలు పథకాల పేరుతో ప్రజలను ఓటు బ్యాంకుగా తయారు చేసుకుంటున్నారు. ఈ పందేరం అభివృద్ధి పనులపై ఖర్చు పెట్టి ఉంటే ఆయా రంగాలు పురోగగమించేవి. కనీస మౌళిక వసతులు సాగు, తాగునీరు. రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, ఆస్పత్రులపై ఖర్చు పెట్టడం లేదు. వీటికి కేటాయింపులు కూడా తక్కువే. కేవలం పెన్షన్లు, ఉచితబియ్యం ఇవే ఇప్పుడు ప్రధాన ఎజెండాగా అమలవుతున్నాయి. జగన్ హయాంలో బటన్ నొక్కుడుతో రాష్ట్ర ఖజానాను దివాళా తీయించారు. విశాఖలో ఆకశ హర్మ్యాల లాంటి భవంతులను కట్టుకున్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కూడా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు డబ్బులు వృధా చేశారు. అప్పనంగా డబ్బులు వెనకేసుకున్నారని ఆరోపిస్తున్న ప్రస్తుత పాలకులు వీటిపై నిజాయితీగా విచారణ జరిపించి, శిక్ష పడేలా చేయలేక పోతున్నారు. పారిశ్రామిక అభివృద్ధి చేసివుంటే కనీసం నిరుద్యోగం తీరేది. ఉత్పాదక రంగం అభివృద్ధి చెందేది. తన ఓటు బ్యాంకు కోసం పాలకులు రాష్ట్రాలను అప్పుల కుప్పగా చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. ఎన్ని కుటుంబాలకు నగగదు బదిలీ చేశామన్నది కాదు. ఎంతగా అభివృద్ధి సాధించామన్న లెక్కలు తీయాలి. ఇకపోతే పరిశ్రమలకు ప్రాణాధానం విద్యుత్. వేసవి వచ్చే వరకు ఎంత వినియోగం ఉంటుందో లెక్కలు వేయలేక పోతున్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి పెంచుకోవడం లేదా..ఉత్పత్తి ఉన్న ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం లాంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం అసమర్థతకు నిదర్శనం. నిజానికి విద్యుత్ ఉంటేనే అడుగు ముందుకు పడే రోజుల్లో ఉత్పత్తిపై వ్యూహం లేకపోవడం దారుణం. కరెంట్‌పై ఖర్చు అన్నది ఉత్పత్తికి, ఉపాధికి బాట వేస్తుందని గుర్తించడం లేదు. కేంద్రంలోని మోడీ కూడా దీనిని పట్టించు కోవడం లేదు. ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలతో కరెంట్ బిల్లులు ప్రజలకు వాతలు పెడుతున్నాయి. భారీగా పెరిగిన చార్జీలతో గృహ వినియోగదారులకు షాక్ తగులుతోంది. ఇకపోతే బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారంఏటేటా తగ్గుతోంది.

# ప్రజా సమస్యలపై పోరాడేదెవరు ?




**న్యూఢిల్లీ :** దేశంలో సమస్య ఏదైనా ఉద్యమించాల్సిన అసవరం ఏర్పడింది. ఆయా వర్గాలు తమ అవస్థలను తెలియ చేసేందుకు ఎక్కడిక్కడ ఉద్యమ రూపంలో ప్రభుత్వాలకు తెలియచేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పార్లమెంట్, అసెంబ్లీలు అధికార పార్టీ, విపక్షాల సొంత ఎజెండాలతో నడుస్తున్నాయి. కేంద్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఆయా రాష్ట్రాల్లో పాలక,ప్రతిపక్షాలు కూడా సొంత ఎజెండానే అనుసరి స్తున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన జరగడం లేదు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరిదీ ఒకటేదారి. ఈ క్రమంలో జాతీయస్థాయి ఉద్యమం చేస్తేనే విపక్షాలను ప్రజలు నమ్ముతారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందిస్తేనే ఇది సాకారం అవుతుంది. తమ రాష్ట్రాల్లో నిరంకుశంగా వ్యవహరిస్తూ వస్తున్న ప్రాంతీయ పార్టీలు కేంద్రంపై యుద్దానికి కదిలినా ప్రజలు నమ్మరని గుర్తించాలి. ఇడి కేసులపై ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్ కూడా అసలు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం లేదు. కేవలం తన రాజకీయ లబ్ధికి అవసరమైన విషయాలపైనే పోరాటాలను, విమర్శలను ఎంచుకుంటోంది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి ఉద్యమం చేయడానికి అడపాదడపా లెఫ్ట్ పార్టీలు రంగంలోకి దిగుతున్నా..వాటి బలం చాలడం లేదు. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలతో పాటు, దాని అనుబంధ సంస్థలు,కార్మిక సంఘాలు వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో సమస్యలను ఆధారం చేసుకుని ఉద్యమిస్తున్నాయి. ఈ దశలో ఇక ఉమ్మడిగా పోరు చేయడానికి అన్ని పార్టీలను కలుపుకుని పోవడానికి సిద్దం కావాలి. అయితే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితుల కారణంగా కొంత వెనకడుగు తప్పడం లేదు. బెంగాల్లో మమతపై పోరాటం చేస్తున్న లెఫ్ట్ పార్టీలకు కాంగ్రెస్‌తో కలసిపోరాడలేక పోతున్నాయి. కేరళలో కూడా అలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయితే స్థూలంగా స్థానిక సమస్యలపై పోరాటాలు చేసేలా ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడం అసవరమని అన్ని పార్టీలు గుర్తించాలి. అయితే ఆయా పార్టీల్లో ఉన్న అనైతక్యతను క్యాష్ చేసుకోవాలని బిజెపి ఊస్తోంది. విపక్ష పార్టీలు పాలిస్తున్నా రాష్ట్రాల్లో నేతల అవినీతిపై కూడా బిజెపి కాచుకుని కూచుంది. ఇవన్నీ కూడా బిజెపికి కలసివచ్చేలా ఉన్నాయి. అయితే సమస్యల ఆధారంగా పోరాడాలని వివిధ పార్టీలు ముందుకు వస్తే ప్రజల మద్దతు తప్పకుండా లభిస్తుంది. ప్రధానంగా రైతాంగ, కార్మిక సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం దేశంలో ఏర్పడింది. ఎందుకంటే పెట్రో, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు వంటివాటిపై పోరాడాల్సిన అసవరం నిరంతరంగా ఉంది. ఉత్తరాదిలో పది రాష్ట్రాల్లో రైతులు ఆందోళనకు దిగి కేంద్రానికి ముచ్చెమటలు పట్టించారు. గతంలో తమిళనాడు రైతులు కూడా ఢిల్లీ వేదికగా ఆందోళను దిగారు. అయితే రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం విఫలమయ్యింది. సాగుచట్టాలను వెనక్కి తీసుకున్నా రైతు సంక్షేమానికి ఒక్క గట్టి నిర్ణయం కూడా తీసుకోలేదు. దీనిని ఆసరగా చేసుకుని రైతులను కలుపుకుని ఉద్యమించేందుకు రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నా..వారిలో నిజాయితీ కానరావడం లేదు. మోడీ పదేళ్ల పాలనలో దేశంలోని సామాన్య ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు దిగజారాయి. దేశంలో 50 శాతంపైబడి ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. అలాంటి వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ హామీలు అటకెక్కాయి. దేశంలో 42 శాతం రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అంటున్నారు. గత పదేళ్ల యూపిఎ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా అమలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఇమర్శలను రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదు. దేశంలో రైతుల వద్ద భూములను వివిధ పరిశ్రమల అవసరాల కోసం బలవంతంగా లాక్కొంటున్న తీరును ఎండగట్టాల్సి ఉంది. దేశంలోని 80 శాతం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులున్నారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడి కొనసాగుతోంది. ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కులగణన కూడా కేవలం రాజకీయ లబ్ధి కోసం తప్ప మరోటి కాదు. నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు ఊడి పోతున్నాయి. విద్యా, వైద్యం, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ బలంగా నాటుకుంది. కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వ పాలనలోకి చొచ్చుకొచ్చేందుకు తలుపులు తెరిచారు. మేక్ ఇన్ ఇండియా నినాదంలో పస లేదు. ఉన్న పరిశ్రమలే మూత పడుతున్నాయి. మొత్తంగా దేశంలో ప్రజలందరూ సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని ప్రజలు గుర్తించారు. ఈ మేరకు దగాపడ్డ వర్గాలను కలుపుకుని ఉద్యమించేందుకు ఉద్యుక్తులు కావాల్సి ఉంది. ప్రజలే తమ సమస్యలను ఎజెండాగా చేయాలి. ఆయా రంగాల్లో ఉన్న వారిని గుర్తించి సమస్యలపై జాతీయస్థాయి పోరాటాలు ఉధృతం చేయాలి. ఇందుకు కలసివచ్చే రాజకీయ పార్టీలను కూడా కలపుకుని పోవాలి. ట్రంప్ సుంకాలు, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆర్థివేత్తలు అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారుల మీదకు నెడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. నిరుద్యోగం మరింత పెరుగుతోంది. పెరిగిన ధరల వలన కొనుగోలు శక్తి తగ్గుతోంది. పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించకపోవడం వలన రవాణాఛార్జీలు పెరిగి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. విపక్షాలు ఇప్పుడు ఈ సమస్యలపై దృష్టి సారించాలి.

# కుట్రదారులను పట్టుకోవాల్సిందే !

**న్యూఢిల్లీ :** 2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉరితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వుర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్బంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నందున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ–రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు– అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ–రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందిం చాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో ముంబై దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో రాణాకు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది.

# బీసీ వాదం ఇప్పుడు వీస్తున్న గాలి



అధికార పార్టీ సామాజిక కులగణన నిర్వహించిన తర్వాత ఎవరి శాతం ఎంతో తెలిసిపోయింది. ఆయా కులాలకు ఎవరి వాటా ఎంతో అవగతం అయింది. ఈ గాలి త్వరలో రాజకీయ తుఫానుగా మారే సంకేతాలను ఇస్తున్నది. వెనుకబడిన కులాలకు ఒక ఆశాకిరణంలా కనపడుతున్నది. ఇప్పటిదాకా 'బడితె ఉన్నోడిదే బర్రె' అన్నట్టు అన్ని పార్టీలు తమ తమ కులాల ప్రాతిపదికన టికెట్లు ఇచ్చాయి. పైకి సామాజిక సమతూకం అంటూనే తీరా చూస్తే అధికార వర్గానికి అగ్ర తాంబూలం ఇచ్చాయి. అంతవరకు చెప్పిన మాటలన్నీ ఎన్నికల సమయానికి మర్చిపోయి బీసీలకు మొండి చేయి చూపించాయి. ఈ పరిస్థితిలో మంచికో చెడ్డకో, ఇష్టం ఉన్నా లేకున్నా, ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ తెలంగాణలో కులగణనకు శ్రీకారం చుట్టి పూర్తి చేసింది. ఈ చర్య క్రమంగా అన్ని రాజకీయ పార్టీలలో బహుజనులను ఏకం చేసే విధంగా సామాజిక విప్లవాత్మక మార్పుగా పరిణమించనున్నది. ఇటీవల దేశంలో ఏర్పడిన కొన్ని పరిణామాల నేపథ్యంలో ప్రాంతీయ, జాతీయ స్థాయిలలో ఆయా పార్టీలు తమ మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవలసిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. రాహుల్‌గాంధీ దేశమంతా చేసిన పాదయాత్ర సామాజిక కులగణనను రాజకీయ పార్టీల ఎజెండా మీదికి బలవంతంగానైనా తెచ్చింది. దీని ప్రభావం గత ఏడాది పార్లమెంటు ఎన్నికల ఫలితాలపైన కనపడింది. అలాగే తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడి వాక్చాతుర్యంపై, ఇచ్చిన వాగ్దానాలపై విశ్వాసంతో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. కాంగ్రెస్ తన హామీలలో ప్రధాన భాగమైన సామాజిక కులగణనను చేపట్టి పూర్తి చేసింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఆమోదించింది. దేశంలోనే ఎస్సీ వర్గీకరణను చట్టం ద్వారా అమలు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం ఖ్యాతిని ఆర్జించింది. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థలలో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు అధికారికంగా ఇవ్వడానికి సంకల్పించింది. ఈ విధంగా భవిష్యత్తులో జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్యమ రూపు దాల్చడానికి రోడ్డు క్లియర్ చేసింది. ఇన్నాళ్ళూ నివురుగప్పిన నిప్పులా ఉన్న వెనుకబడిన వర్గాలు త్వరలో తమ హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ముందెన్నడూ లేనంత ఒత్తిడి పెంచనున్నాయి.


# ఆపరేషన్ సిందూర్

## శత్రుదేశానికి గట్టి హెచ్చరిక




'ఆపరేషన్ సిందూర్ లక్ష్మణరేఖ - ఇంకోసారి దాడి చేస్తే చొరబడి మరీ అంతు చూస్తాం'... పాకిస్థాన్ సరిహద్దుకు దగ్గరగా, తాము నాశనం చేశామని పాకిస్థాన్ ప్రకటించుకున్న అదంపూర్ ఎయిర్‌బేస్ వేదికగా, పాకిస్థాన్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన హెచ్చరిక ఇది. ఓ వైపు పాకిస్థాన్ డ్రోన్లను, మిస్సైళ్లను నేలకూల్చిన %ూ-%400, మరోవైపు బ్రహ్మోస్‌తో పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను పనికి రాకుండా చేసిన సుఖోయ్ యుద్ధ విమానం ఉండగా మోదీ ఈ హెచ్చరిక చేశారు. ధీరులైన సైనికులు పిడికిలి బిగించి చేసిన 'భారత్ మాతాకీ జై' అనే నినాదాలు సమీపంలోని పాకిస్థాన్‌లోనూ ప్రతిధ్వనించి ఉంటాయి. భారత్ సామర్థ్యం, బలం ప్రధాని మాటల్లో, చేతల్లో ప్రపంచం అంతా చూసింది. భారత సైన్యం పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. ప్రశాంతంగా ఉన్న కశ్మీర్ టూరిజం, పరిశ్రమల రాకతో ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఉగ్రవాద జాడలేమీ మిగలవని భయపడిన పాకిస్థాన్ ఆర్మీ తన కుట్రలను అమలు చేసి తన నెత్తిమీదే చేయి పెట్టుకుంది. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ కశ్మీర్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించిన వారానికే పహల్గాంలో టూరిస్టులను చంపేశారు. వెళ్లి మోదీకి చెప్పుకోవాలని పర్యాటకులకు సూచించారు. భారతీయుల జోలికి వచ్చినందుకు వారికి అప్పటికే డెత్ డేట్ ఖరారు అయిందని తర్వాత పరిణామాలు నిరూపించాయి. భారత్ దాడి చేస్తుందని ప్రపంచం అంతా తెలుసు, పాకిస్థాన్‌కూ తెలుసు. అయినా సరే, ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ నేతృత్వంలో అమలు చేశారు. తమ ఉగ్రవాద శిబిరాల జాడలు భారత్‌కు తెలియవని అనుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో ఉన్నాయి కాబట్టి టెర్రరిస్టుల్ని కాపాడుకోవచ్చని అనుకున్నారు. కానీ ఆపరేషన్ సిందూర్ వంద మందికిపైగా కరుడుగట్టిన ఉగ్రవాదుల అంతం చూసింది. ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ ఆర్మీ, పాలకులు పాల్గొన్న సత్యాన్ని ప్రపంచానికంతటికీ భారత్ తెలియజెప్పింది. పాకిస్థాన్ పిచ్చిపట్టినట్లుగా భారత సరిహద్దుల్లో డ్రోన్ దాడులు చేస్తే, వాటిని కూల్చివేసి, నేరుగా పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు గురిపెట్టింది. తీవ్రంగా దెబ్బతిన్న పాకిస్థాన్... టర్కీ నుంచి తెచ్చుకున్న డ్రోన్లు, చైనా ఇచ్చిన హతాఫ్ క్షిపణులతో దాడికి ప్రయత్నించినా, అన్నింటినీ భారత్ నేలమట్టం చేసింది. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్థాన్‌కు ఉనికి సమస్య వచ్చేసింది, అందుకే కాళ్ల బేరానికి వచ్చింది. 'ఆపరేషన్ సిందూర్'లో మన సైన్యం ధ్వంసం చేసిన ఎయిర్‌బేస్‌లలో అత్యంత ముఖ్యమైనది రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్. ఇది పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ లాజిస్టిక్, కమాండ్ హబ్. ఇక్కడ ఉన్న %జ-%130 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్, %×ూ-%78 రీఫ్యూయలింగ్ ట్యాంకర్స్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్‌ను భారత దళాలు ధ్వంసం చేశాయి. చక్వాల్‌లోని మురిద్ ఎయిర్‌బేస్ మీద భారత్ చేసిన దాడిలో డ్రోన్ సౌకర్యాలు, ఫైటర్ జెట్‌లు ధ్వంసమయ్యాయి. %జీఖీ-%17, మిరాజ్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న రఫీకీ ఎయిర్‌బేస్‌నూ భారత దళాలు టార్గెట్ చేసి ధ్వంసం చేశాయి. రహీం యార్‌ఖాన్ ఎయిర్‌బేస్ రన్‌వేలో భారీ గొయ్యి పడేలా భారత దళాలు బాంబులు వేశాయి. సింధ్ ప్రావిన్స్‌లోని సుక్కూర్ ఎయిర్‌బేస్ రన్‌వే, సౌకర్యాలు దెబ్బతిన్నాయి. పంజాబ్‌లోని చునియన్ ఎయిర్‌బేస్ మీద చేసిన దాడిలో ఎయిర్ డిఫెన్స్ రాడార్‌లు ధ్వంసమయ్యాయి. సింధ్‌లోని భోలారీ ఎయిర్‌బేస్ హ్యాంగర్, రన్‌వేకు పెద్ద నష్టం వాటిల్లి, అక్కడ 50 మందికి పైగా మరణించారు. వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసుఫ్, నలుగురు ఎయిర్‌మెన్ ఉన్నారు. ముషాఫ్ ఎయిర్‌బేస్‌పై భారత్ చేసిన దాడితో కిరనా హిల్స్‌లో భూగర్భ న్యూక్లియర్ నిల్వ స్థలాలకు సమస్యలు వచ్చాయని చెబుతున్నారు. ఈ దాడి పాకిస్థాన్‌లో ఆందోళనను రేకెత్తించింది. ఈ స్థావరం పాక్ ఆక్రమిత కశ్మీర్ సమీపంలో ఉంది. పాకిస్థాన్ సైన్యం లైన్ ఆఫ్ కంట్రోల్ వెంబడి 35%-%40 మంది సైనికులను కోల్పోయింది. ఎయిర్‌ఫోర్స్ అనేక హైటెక్ ఎయిర్ క్రాఫ్ట్‌లను కోల్పోయింది. ఈ దాడులు పాకిస్థాన్ రక్షణ సామర్థ్యాలను, ఆత్మ స్థైర్యాన్ని బాగా దెబ్బతీశాయి. ఎంతగా అంటే భారత ప్రధాని అదంపూర్ ఎయిర్‌బేస్‌లో ప్రసంగిస్తే దానికి పోటీగా పాకిస్థాన్ ప్రధాని కూడా ఓ ఎయిర్‌బేస్‌కు వెళ్లారు. కానీ అక్కడ ఎయిర్‌బేస్ లేదు. యుద్ధ ట్యాంక్‌పై నిలబడి మాట్లాడాల్సి వచ్చింది. మత మౌఢ్యంతో నిండిన టర్కీ.. భారత్‌పై వ్యతిరేకతను నరనరాన నింపుకున్న చైనా తప్ప, ఎవరూ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వలేదు. బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది. కాల్పులు ఆపాలంటూ పాక్ ఆర్మీనే మొదట ప్రతిపాదించింది. అప్పటికే భారత్ తన లక్ష్యాలను చాలావరకూ సాధించింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. పాకిస్థాన్ సైన్యం సమీపకాలంలో కోలుకోలేని విధంగా దాని మౌలిక సదుపాయాల్ని దెబ్బతీసింది. మరొక్కరోజు ఘర్షణలు కొనసాగి ఉంటే కరాచీ పోర్టు నుంచి ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్టు వరకూ ఏవీ మిగిలేవి కావు. భారత్ సాధించిన విజయం ఎంత పద్ధతిగా ఉందో చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోతున్నాయి. మన బ్రహ్మోస్ క్షిపణి కోసం 17 దేశాలు ప్రతిపాదనలు పెట్టాయి. యుద్ధం ఎలాంటిదైనా వినాశనమే. అందులో విజేతలు సాంకేతికంగా ఉంటారు కానీ.. యుద్ధం చేసిన వారంతా నష్టపోతారు. ఆ విషయమే ప్రధాని మోదీ చెప్పారు. ఇది యుద్ధాల యుగం కాదన్నారు. అదే సమయంలో ఉగ్రవాద యుగం కూడా కాదని స్పష్టం చేశారు. శత్రువును ఓడించడమే యుద్ధంలో విజయం కానీ.. చంపడం కాదు. చంపడం కన్నా.. ఓడించడం ద్వారా జీవితకాలం ఆ విజయం నిలుస్తుంది. ఈ యుద్ధనీతిని బాగా ఔపోసన పట్టిన నేత ప్రధాని నరేంద్రమోదీ. ఈ భరతమాత ముద్దుబిడ్డ మనదేశాన్ని ప్రపంచంలో అత్యున్నత శక్తిగా నిలబెట్టారు. ఆపరేషన్ సిందూర్ భారత చరిత్రలో ఓ విజయపతాక.

# సిక్కిం విలీనానికి ఏభై ఏళ్ళు




స్వతంత్ర భారత చరిత్రలో సిక్కిం విలీనం ఒక ప్రధాన ఘట్టం. మే 16, 1975న జరిగిన ఈ చారిత్రక ఘట్టానికి ఏభై ఏళ్ళు నిండినందున నాటి గొలుసుకట్టు సంఘటనలు, రాజకీయ పరిస్థితులు, ఇందిరాగాంధీ దూరదృష్టి వంటి అంశాలను సింహావలోకనం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. భారతదేశానికి ఈశాన్య సరిహద్దులో నేపాల్, భూటాన్‌ల నడుమ ఒక రాష్ట్రం సిక్కిం. వైశాల్యంలో గోవాకు ఒక మెట్టు పైన ఉండే సిక్కిం, జనాభా పరంగా అతి చిన్న రాష్ట్రం. ప్రకృతి సౌందర్యానికి, ప్రశాంతతకు నెలవై, హిమాలయాల పర్వతశ్రేణి ఒడిలో ఒదిగి 500 సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్న దీని చరిత్ర ఆద్యంతం ఆసక్తికరమైనదే. ఎనిమిదవ శతాబ్దంలో పద్మసంభవ (టిబెటన్ భాషలో గురు రింపోచే) అనే బౌద్ధగురువు టిబెట్‌తో పాటు సిక్కింకు వజ్రయాన బౌద్ధాన్ని పరిచయం చేయగా, కొన్ని శతాబ్దాల తరువాత రాజ వంశీకులు (చొగ్యాల్) దానిని అవలంబించారు. ఇరుగు పొరుగు రాజ్యాలైన నేపాల్, భూటాన్‌ల దాడులకు గురైనప్పుడల్లా సిక్కింను టిబెట్ కాపాడేది. 18వ శతాబ్దపు చివర్లో చైనాకు చెందిన క్వింగ్ రాజులు కొన్నాళ్ళు పాలించగా, 1853లో ఈస్ట్ ఇండియా కంపెనీ (బ్రిటిష్) పరమైంది. ఎన్నో మలుపులు తిరిగిన తరువాత 1918లో బ్రిటిష్ ప్రభుత్వం... రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా సిక్కింకు అంతర్గత వ్యవహారాలలో పూర్తి స్వేచ్ఛనిచ్చింది. సిక్కిం స్టేట్ కాంగ్రెస్ 1948లో రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించడం ప్రారంభించింది. సిక్కిం రాజు%-% భారత ప్రధాని నెహ్రూ సహాయం కోరగా, భారత్ ఒక దివాన్‌ను, కొంత భద్రతా బలగాన్ని అక్కడకు పంపించింది. అప్పుడు ఉత్పన్నమైన విలీన ప్రతిపాదనను "చిన్నదైన ఒక సార్వభౌమ దేశాన్ని కబళించామన్న అపప్రథ తమకు అక్కరలేదని, పైగా ఆ విలీనం చైనాను రెచ్చగొట్టేదిగా కనిపిస్తుంది" అంటూ తిరస్కరించారు నెహ్రూ. 1950లో భారత రక్షణలో మెసిలే రాజ్యంగా సిక్కిం అవతరించింది. 1962లో జరిగిన చైనా%-%భారత్ యుద్ధం భారత రక్షణ వ్యవస్థలో పెను మార్పులకు దారి తీసింది. రక్షణ విషయంలో లాల్ బహదూర్ శాస్త్రి, తరువాత ఇందిరా గాంధీ కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. 1967లో సిక్కిం%-%చైనా సరిహద్దుల్లో గల నాథులా, చోలా కనుమల వద్ద ఇనుప కంచె వేస్తున్న భారత సరిహద్దు దళాల సైనికులను చైనా సైనికులు వెనక్కు జరగమన్నారు. అయినా భారత దళాలు వెనుకడుగు వేయలేదు. ఫలితంగా ఘర్షణ జరిగింది. నాథులా కనుమ వద్ద సెప్టెంబర్‌లో, చోలాలో అక్టోబర్‌లో జరిగిన ఘర్షణలలో ఇరువైపులా ప్రాణ నష్టం జరిగింది. భారత శక్తిని తక్కువ అంచనా వేసిన చైనా దళాలు, మన సైనికుల తెగువతో వెనుదిరిగారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ సిక్కిం భౌగోళిక, వ్యూహాత్మక ప్రాముఖ్యతపై దృష్టి సారించి, దీర్ఘకాలిక ప్రణాళికా రచనలో నిమగ్నమయ్యారు. సిక్కిం ఉత్తరాన ఉన్న చుంబి లోయపై చైనా కన్నువేసిందని ఆమెకు స్పష్టమైన సంకేతాలు అందాయి. సిక్కిం విషయంలో ఒక బలమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించి, వెంటనే పావులు కదిపారు. 1973లో జరిగిన ప్రజా ఉద్యమం ధాటికి చొగ్యాల్ (సిక్కిం చక్రవర్తిని చొగ్యాల్‌గా పిలిచేవారు) భారత ప్రభుత్వ సహాయాన్ని అర్థించగా, భారత్ 1200 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను పంపి ఉద్యమాన్ని నియంత్రించింది. అయినా 1974లో సిక్కిం ప్రధానమంత్రి కాజీ లెండుప్ దర్జీ, సిక్కింను భారత్‌లో విలీనం చేయమని ఇందిరా గాంధీకి విజ్ఞప్తి చేయగా, ఆ ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. విలీనం రెఫరెండం ద్వారా జరగాలని నిర్ణయించి, భారత ప్రభుత్వ బలగాల పర్యవేక్షణలో సిక్కిం ఎలక్షన్ కమిషన్‌కు ఆ పని అప్పజెప్పారు. ఏప్రిల్ 6న భారత్ భద్రతా సైనికులు రాజప్రాసాదంలోకి ప్రవేశించి 243 మంది సిక్కిం సైనికులను నిరాయుధులను చేశారు. దురదృష్టవశాత్తు ఒక సైనికుడు మరణించాడు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా, విలీనానికి మద్దతుగా 59,637 ఓట్లు రాగా, వ్యతిరేకంగా కేవలం 1,496 ఓట్లు పడ్డాయి. ఈ రెఫరెండం ప్రక్రియ మోసపూరితంగా భారత భద్రతా దళాల తుపాకుల కనుసన్నలలో జరిగిందని చైనా, పాకిస్తాన్‌లు విమర్శించాయి. దీనిని తిప్పికొడుతూ ఆజాద్ కశ్మీర్, టిబెట్‌ల వైనాలను ఇందిరాగాంధీ ఉదహరించారు. సిక్కిం విద్యార్థుల నిరసనను మన దళాలు సునాయాసంగా అణచివేశాయి. ఆండ్రూ డఫ్ అనే ఆంగ్ల పాత్రికేయుడు తన ' గ్రంథంలో నాటి సంఘటనలు పూసగుచ్చినట్లు వర్ణించాడు. 1975, ఏప్రిల్ 11%-%16 మధ్య జరిగిన రెఫరెండం భారత్‌లో సిక్కిం విలీనానికి మార్గం సుగమం చేసింది. సిక్కిం భారత్‌లో విలీనానికి రాజకీయ పరిస్థితులకు, సాంస్కృతిక కారణాలు కూడా తోడయ్యాయి. అదే ఏడాది మే 16న పార్లమెంట్‌లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను 22వ రాష్ట్రంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. మొత్తానికి సిక్కిం విలీనం ద్వారా ఇందిరాగాంధీ తన రాజకీయ నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని మరొకసారి ప్రపంచానికి చాటి చెప్పారు. ఈ ఏభై ఏళ్లలో సిక్కిం ఒక ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. వంద శాతం సేంద్రీయ వ్యవసాయాన్ని కొనసాగిస్తోంది. తలసరి ఆదాయంలో భారత్‌లో ప్రథమ స్థానాన్ని అందుకుంది. ఎటువంటి వేర్పాటు ఉద్యమాలు లేని ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం ప్రపంచ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. పర్యాటకుల స్వర్గధామమైన ఈ రాష్ట్రం, భారత సరిహద్దులలో ప్రకాశించే మణిపూసగా అభివర్ణించవచ్చు.

# తమ్ముడి హంగామా



# వేదం చదివిన శరభం యుద్ధానికి దిగింది

‘నా శివుడి అనుమతిలేనిదే ఆ యముడైనా కన్నెత్తి చూడడు..నువ్వు చూస్తావా? అమాయకుల ప్రాణాలు తీస్తావా?’ అంటూ ప్రళయకాల రుద్రుడివలే ‘అఖండ-2: తాండవం’కు సిద్ధమయ్యారు అగ్ర నటుడు బాలకృష్ణ. ఆయన తాజా చిత్రం ‘అఖండ-2’ దసరా కానుకగా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో 14 రీల్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. నేడు బాలకృష్ణ జన్మదినం. ఈ సందర్భంగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. కైలాస పర్వతం నేపథ్యంలో మొదలైన టీజర్ ఆద్యంతం రోమాంచితంగా సాగింది. అఖండగా బాలకృష్ణ పాత్ర రౌద్రరసపూరితంగా సాగింది. ‘వేదం చదివిన శరభం యుద్ధానికి దిగింది..’ అనే సంభాషణతో ముగిసిన టీజర్ అభిమానులకు కావాల్సినంత థ్రిల్‌ను పంచింది. దర్శకుడు బోయపాటి శ్రీను యూనిక్ మేకింగ్, బాలకృష్ణ హై ఇంటెన్సిటీ పర్‌ఫార్మెన్స్, కైలాసగిరి నేపథ్య విజువల్స్ టీజర్‌పై అంచనాలు పెంచాయి. ఈ చిత్రానికి సంగీతం: తమన్, సమర్పణ: తేజస్విని నందమూరి, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.




నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘తమ్ముడు’. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రధారులు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 4న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ నెల 11న సాయంత్రం 5గంటలకు ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ‘తమ్ముడు’ మూవీ ట్రైలర్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ వీడియోను ఫన్నీగా మేకర్స్ డిజైన్ చేశారు. లయ, వర్ష బొల్లమ్మ, స్వసిక విజయన్, సప్తమి గౌడ, బేబీ శ్రీరామ్‌ఆదిత్య అందరూ కలిసి ఈ సినిమా ట్రైలర్ రిలీజ్‌కీ తామంటే తామే కారణమని గొడవ పడుతుండగా.. దర్శకుడు శ్రీరామ్ వేణు వచ్చి ‘మీ డౌట్స్ అన్నీ క్లారిఫై కావాలంటే ముందు ట్రైలర్ చూడండి..’ అని చెప్తాడు. ఈ విధంగా మూవీ లవర్స్‌లో సినిమాపై ఆసక్తి పెరిగే విధంగా ట్రైలర్ అనౌన్స్‌మెంట్ వీడియోను మేకర్స్ డిజైన్ చేశారు. ఎంసీఏ, వకీల్‌సాబ్ చిత్రాల తర్వాత శ్రీరామ్ వేణు దర్శకత్వం వస్తున్న ఈ సినిమా దర్శకుడిగా అతని స్థాయిని మరింత పెంచేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోకనాథ్.

# ‘చండీ దుర్గమా’ ప్రారంభం



నూతన తారాగణంతో తెరకెక్కిస్తున్న ‘చండీ దుర్గమా’ చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హెచ్‌బీజే క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మైనుఖాన్ ఎండీ దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి హాస్య నటుడు అలీ క్లాప్‌నిచ్చారు. ఈ సందర్భంగా దర్శకుడు మైనుఖాన్ ఎండీ మాట్లాడుతూ ఇటీవలకాలంలో అమ్మవారి నేపథ్యంలో సినిమాలు రావడం లేదని, ఈ తరం ప్రేక్షకులు నచ్చేలా సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, డార్క్ థీమ్ జోనర్‌లో సరికొత్త స్క్రీన్‌ప్లేతో ఆకట్టుకుంటుందని తెలిపారు. త్వరలో నటీనటులను ప్రకటించనున్న ఈ చిత్రానికి కెమెరా: వైఎస్ కృష్ణ, సంగీతం: ఎంకే, నిర్మాత: జయశ్రీ వెల్ది, రచన-దర్శకత్వం: మైనుఖాన్ ఎండీ.

# ఈ గూఢచారి.. ఓ మానవ యంత్రం



‘నీకు నా గురించి తెలియదు. ఇప్పుడు తెలుసుకుంటావ్..’, ‘నా కళ్లు నిన్ను ఎప్పటి నుంచో వెంటాడుతున్నాయి కబీర్’ అనే పవర్‌ఫుల్ సంభాషణలతో గత నెలలో ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా విడుదలైన ‘వార్-2’ టీజర్ ప్రేక్షకుల్లో అంచనాల్ని అమాంతం పెంచింది. ఎన్టీఆర్ పాత్రను ప్రజెంట్ చేసిన విధానం అభిమానుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకురానుంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ లుక్స్, కాస్ట్యూమ్స్ గురించి చిత్ర కాస్ట్యూమ్ డిజైనర్ అనైతా ష్రాఫ్ అడజానియా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఎన్టీఆర్ సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తే అందరిలో ఏదో తెలియని ఎనర్జీ వచ్చిన భావన కలుగుతుందని, ఆయన ఆకర్షణ శక్తి అలాంటిదని ప్రశంసించారు. ఎన్టీఆర్ పాత్రలో ఎన్నో లేయర్స్ ఉంటాయని, వాటికి తగినట్లుగా డిఫరెంట్ లుక్స్, కాస్ట్యూమ్స్ డిజైన్ చేశామని, ఈ సినిమాలో ఆయన ఓ లక్ష్యంతో పనిచేసే మానవ యంత్రంలా కనిపిస్తారని అనైతా ష్రాఫ్ వివరించారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ ‘రా’ విభాగం గూఢచారి పాత్రలో కనిపించనున్నారు.

# వర్ణించ తరం కానిది నీ ప్రేమ..

అన్యోన్య దాంపత్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు కోలీవుడ్ క్యూట్ కపుల్ నయనతార, విఘ్నేష్. ఈ జంట దంపతులై సోమవారానికి మూడేళ్లు. ఈ సందర్భంగా నయనతార షేర్ చేసిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలతోపాటు తన భర్తకు ఓ అద్భుతమైన ప్రేమలేఖను కూడా రాసేశారు నయనతార. ‘ఒకరిపై ఒకరు ఇంతలా ఎలా ప్రేమ చూపుతారనేది ఎప్పటికీ సమాధానం దొరకని ప్రశ్నే అనుకున్నాను. కానీ.. నీ రూపంలో దానికి సమాధానం దొరికింది. వర్ణించడానికి అలవికానిది నీ ప్రేమ. నా మనసు కోరుకునే ప్రేమవు నువ్వు. ఇద్దరిగా మొదలైన మన ప్రయాణం నలుగురిగా మారింది. కోరుకోవడానికి ఇంతకు మించి ఏముంటుంది? స్వచ్ఛమైన ప్రేమను పంచుతున్న నా జీవిత భాగస్వామికి పెళ్లిరోజు శుభాకాంక్షలు.’ అని పొయెటిగ్గా విష్ చేశారు నయనతారు. ఈ పోస్ట్ చూసిన వారంతా ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131, 8096660656